


## చరిత్ర సృష్టించిన మహమ్మద్ షమీ..

భారత పేస్ బౌలర్ మహమ్మద్ షమీ చరిత్ర సృష్టించాడు. చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో బంగ్లా బ్యాటర్ జాకిర్ వికెట్ తీసి తన ఖాతాలో కొత్త రికార్డును వేసుకున్నాడు షమీ. వన్డేల్లో 200 వికెట్లు తీసిన స్పీడ్ బౌలర్ అయ్యాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 200 వికెట్లు తీసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. షమీ మొత్తం 5126 బంతులు వేసి తన ఖాతాలోకి 200వ వికెట్ వేసుకున్నాడు. అయితే ఆసీస్ బౌలర్ స్టార్క్ 200 వికెట్లు తీసుకోవడానికి 5240 బంతులు వేయాల్సి వచ్చింది. కానీ అతి తక్కువ మ్యాచుల్లో స్టార్క్ ఆ రికార్డును అందుకున్నాడు. టీ20 వరల్డ్‌కప్ తర్వాత గాయపడ్డ షమీ.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చాడు.


శుక్రవారం
హైదరాబాద్
21.02.2025

సంపుటి : 15 సంచిక: 164
పేజీలు: 8 వెల: రూ.5

@ChattamTV

# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక




# జగన్ కోసం కృష్ణార్పణం

- బిఆర్ఎస్ పాలనలోనే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం
- ఆంధ్రప్రదేశ్ జల దోపిడీకి కెసిఆర్ సహకరించారు
- జగన్‌తో దోస్తీ కారణంగానే ఎపి కృష్ణా జలాలను దోచుకెళ్లినా.. కెసిఆర్ నోరు విప్పలేదు
- మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాలను నాశనం చేశారు
- ఎస్ఎల్బిసి పూర్తి చేయాలని అడిగితే వెటకారంగా మాట్లాడారు
- ఆరు నెలల్లో టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేస్తాం
- కాళేశ్వరం అప్పు రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**చట్టం, హైదరాబాద్:** బిఆర్ఎస్ పాలనలో నీటి పారుదల రంగాన్ని భ్రష్టు పట్టించారని, నీళ్లు, నిధులు, నియామకాలు పేరుతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం చేశారని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్ విమర్శించారు. కృష్ణా నది జల కేటాయింపులకు సంబంధించి తెలంగాణకు 299 టీఎంసీ, ఆంధ్రప్రదేశ్కు 512 టీఎంసీ కేటాయింపులపై కెసిఆర్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని వారు చెప్పారు. నీటి కేటాయింపులు లేకుండా కేంద్రం అనుమతులు లేకుండా వారి అవినీతి పనుల కోసమే బిఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు కట్టిందని ఆరోపించారు. గురువారం జలసౌధలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ లక్ష కోట్లు ఖర్చు చేసి కొత్తగా ఒక్క ఎకరం కూడా సేద్యంలోకి తీసుకు రాలేకపోయారని, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ కోసం రూ.25,500 కోట్లు ఖర్చు చేసి ఏమీ సాధించలేకపో యారని ఎద్దేవచేశారు. నాడు ఏపీ సీఎం జగన్తో మిలాఖత్ అయ్యి కృష్ణానదీ జలాల తరలింపునకు బీఆర్ఎస్ సర్కారు సహక రించిందంటూ నాటి కృష్ణా నీటి వినియోగం గ ణాంకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మా కాంగ్రెస్ ప్రభుత్వం వారి అక్రమ చర్య ఎండగడుతూ వారి అవినీతిని నిల దీస్తున్నందుకు మాజీ మంత్రి హరీష్ రావు ప్రభు త్వంపై అసంబద్ధమైన ఆరోపణలు చేస్తుండడం సిగ్గుచేటని మంత్రులు వ్యాఖ్యానించారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం సకాలంలో ఎస్.ఎల్.బి.సి, పాల మూరురంగారెడ్డి, నెట్టెంపాడు, డిండి వంటి వంటి కృష్ణా బేసిన్ లో ప్రాజెక్ట్ PV పూర్తి చేసి ఉంటే ఏపీ నీటి దోపిడీ జరిగే అవకాశమే ఉండేది కాదన్నారు. ఉదయ్‌పూర్లో సానుకూలత ఈనెల 18, 19 తేదీలలో రాజస్థాన్లోని ఉదయ్ పూర్లో జరిగిన జాతీయ నీటిపారుదల మంత్రుల సదస్సులో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ను కలసి తెలంగాణ లో నీటిపారుదల అంశాలై ఎంతో సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దూషించేందుకు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపిం చారు. లక్ష కోట్లకు పైగా అప్పుచేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇది తప్పుడు డిజైన్, నాసిరకం నిర్మాణం మరియు నిర్వహణ లేకపోవడం వల్ల సమస్యలకు గురైందని మంత్రి వెల్లడించారు. వారు వైఫల్యాన్ని ఒప్పుకోరు బీఆర్ఎస్ ప్రభుత్వం 'కాళేశ్వరం హృదయం'గా పేర్కొన్న మేడిగడ్డ బ్యారేజ్ వారి స్వంత పాలన లోనే కూలిపోయిందని, అలాంటి వైఫల్యాన్ని ఒప్పుకోకుండా, మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఇరి గేషన్ మంత్రి హరీష్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతలు ఒకే ఒక స్తంభం కూలిపోయిందని నిర్లజ్జగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం అధిక వడ్డీలతో తెచ్చిన అప్పులు తెలంగాణపై భారీ ఆర్థిక భారంగా మారాయని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. దేవాదుల, కల్వకుర్తి, నెట్టంపాడు, భీమా, కోయల్ సాగర్, ఎస్ఎలీ బీసీ, డిండి వంటి దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయ్యలేక పోయారో బిఆర్ఎస్ నేతలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. త్వరలో నీటి కేటాయింపులుసీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కోసం గోదావరి నది జలాల 67 టీఎంసీ కేటాయింపును వేగ వంతం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. సమ్మక్క సారక్క ప్రాజెక్ట్ కోసం 44 టీఎంసీ కేటా యింపుకు చర్చలు జరుగుతున్నాయని, సమ్మక్క సారక్క ప్రాజెక్ట్పై ఛత్తీస్గఢ్ తో నో ఒబ్జెక్షన్ సర్టిఫి కేట్ (ఎన్ఓసీ) కోసం కార్యదర్శితో సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కెసిఆర్, జగన్ మధ్య అవగాహన కేసీఆర్, ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మధ్య కృష్ణానదీ వినియోగంపై రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారని మంత్రులు ఆరోపించారు. ఫలితంగా ఎపెక్స్ సమావేశం వాయిదా వేసుకున్న కొన్ని రోజుల తర్వాతే ఆర్ఎస్ఐఎస్ ప్రాజెక్టు ఆమోదం లభించిందన్నారు. ఇదే విష యాన్ని ఏపీ సీఎం జగన్ అసెంబ్లీలో స్వయంగా ప్రకటించిన సంగతిని వారు గుర్తు చేశారు. దీంతో తెలంగాణకు సహజంగా ప్రవహించే 7 టీఎంసీ కృష్ణా నీటిని కోల్పోయింది, కానీ ఆంధ్రప్రదేశ్కు శ్రీశైలం నుంచి రోజుకు 8 టీఎంసీ నీటిని తీసుకు నేందుకు అనుమతి లభించింది అని వారు వివ రించారు.ఇరవై నెలల్లో ఎస్ఎల్బిసి పూర్తి ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు వచ్చే ఇరవై నెలల్లో పూర్తిచేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

## రేవంత్ ఇక చిల్లర మాటలు ఆపు



- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయమనడం పచ్చి అబద్ధం
- కళ్లుండి చూడలేని, చెవులుండీ వినలేని కబోదులు కాంగ్రెస్ నేతలు
- కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై చర్చకు సిద్ధమా?
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ చీకటి మిత్రులు
- కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసు, ఫార్ములా ఈ రేస్ కేసులేమైనయ్?
- ఎన్నికల కోసం ఢిల్లీకి పోయి కాంప్రమైజ్ అయిన మాట నిజం కాదా?
- కేంద్రమంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్

**చట్టం, హైదరాబాద్:** ఈసారి కేంద్ర బడ్జెట్ లో పన్నులు, పథకాల రూపంలో తెలంగాణకు రూ.1.08 లక్షల కోట్లు కేటాయించామని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లోని మెర్క్యూరీ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందనడం పచ్చి అబద్ధమని, కళ్లుండి చూడలేని, చెవులుండి వినలేని కబోధులు కాంగ్రెస్ నేతలు అని మండిపడ్డారు. 6 గ్యారంటీలపై డైవర్ట్ చేయడానికే కేంద్రంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని గ్రామాలు, పట్టణాల వారీగా కేంద్రం ఏం చేసిందో, రాష్ట్రం ఏం చేసిందో చర్చించడానికి సిద్ధమా అని కాంగ్రెస్‌కు సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో? ఎవరు అన్యాయం చేశారో బహిరంగ చర్చకు మేం సిద్ధమన్నారు. ప్రధాని హోదాకు గౌరవం ఇవ్వకుండా అవాకులు పేలడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సిద్ధమా అని ఛాలెంజ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి పోయి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ చిల్లర మాటలు ఇక ఆపు అని హెచ్చరించారు. రేవంత్ మాటాలను ప్రజలు మెచ్చడం లేదని అన్నారు. రేవంత్ తన వైఖరి మార్చుకోవాలని బండి సంజయ్ సూచించారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయి**

ఏపీతో కుమ్మక్కై తెలంగాణకు అన్యాయం చేసిన మొట్టమొదటి ద్రోహి కేసీఆర్ అన్నారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు కట్టకుండా జాప్యం చేసింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని ఈ రెండు పార్టీలు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ చీకటి మిత్రులు.. కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసు, ఫార్ములా ఈ రేస్ కేసులేమయ్యాయని బండి సంజయ్ ప్రశ్నించారు. ఢిల్లీకి పోయి కాంప్రమైజ్ అయిన మాట నిజం కాదా? మాపై కేసులు పెట్టొద్దు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అడ్డుకుందామని కేసీఆర్ ప్రతిపాదించారన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేందుకే అభ్యర్థులను నిలబెట్టకుండా కేసీఆర్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. భూపాలపల్లి రాజలింగమూర్తి హత్యపై విచారణ జరిపి నిజాయితీ నిరూపించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు.ఒక వ్యక్తిని ప్రాణం తీయడమంటే అంతకంటే దుర్మార్గం ఇంకోటి లేదు హతుడి భార్య చేస్తున్న ఆరోపణలపై లోతైన విచారణ జరపాలని..ఎంక్వైరీ కాకముందే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సరికాదన్నారు.

**తెలంగాణకు కేంద్ర బడ్జెట్ లో కేటాయించిన నిధులు..**

ట్యాక్స్ డివల్యూషన్ రూపంలో 29 వేల 899 కోట్ల రూపాయలు. గత ఏడాదితో పోలిస్తే 10 శాతం అధిక నిధులు గ్రాంట్ల రూపంలో 21 వేల 75 కోట్లు రైల్వేల అభివృద్ధికి 5 వేల 336 కోట్లు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్ లో రూ. 2 వేల 500 కోట్లు రోడ్లు, రైళ్లు, విమానయాన రంగాల అభివృద్ధి కోసం రూ. 28 వేల 302 కోట్లు విద్యుత్, ఇంధన, నీటిపారుదల రంగాల అభివృద్ధి కోసం రూ. 10 వేల 285 కోట్లు గ్రామాల, పట్టణాల అభివృద్ధి కోసం ఈ ఏడాది మొత్తం 6 వేల 320 కోట్లు ఖర్చు చేయబోతున్నం ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా ఇండ్ల నిర్మాణం కోసం రూ. 2 వేల 120 కోట్లు వ్యవసాయం, సహకార, పశుసంవర్థక శాఖల ద్వారా రైతులకు రూ. 5 వేల 920 కోట్లు తెలంగాణలోని ఆరోగ్యం, పారిశుధ్య రంగాల కోసం రూ. 5వేల 790 కోట్లు విద్యా, క్రీడా రంగాల అభివృద్ధి కోసం రూ. 4 వేల 930 కోట్లు ఖర్చు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ కోసం 880 కోట్లు రాష్ట్రంలోని మహిళా, శిశు సంక్షేమ రంగాల అభివృద్ధి కోసం 3 వేల 560 కోట్లు.

## రాజకీయ హత్యలు!

**చట్టం, హైదరాబాద్:** రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. గత కొన్నాళ్లుగా రాజకీయ నాయకుల హత్యలు పెరుగుతున్నాయి. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురి హత్యలు సంచలనంగా మారుతున్నాయి. గతంలో వనపర్తి జిల్లాలో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్య వ్యవహారం కొలిక్కి రాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుచరుడు మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. తాజాగా రాజలింగమూర్తి హత్య కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఇలాంటి రాజకీయ హత్యలపై రాష్ట్రంలో విభిన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో కొన్ని పిల్లర్లు కుంగిపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఫిర్యాదు చేసిన భూపాలపల్లికి చెందిన రాజ లింగమూర్తి. ఇంతకీ ఆయనను చంపిందెరు? పగబట్టి చంపారా, రాజకీయ హత్యా? అధికార పార్టీ ముమ్మాటికీ రాజకీయ హత్యేనని ఆరోపిస్తోంది.



**శ్రీధర్ రెడ్డి హత్య వ్యవహారం..**

బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్య వ్యవహారం కొలిక్కి రాలేదు. గతేడాది మే నెలలో అర్ధరాత్రి చిన్నంబావి మండలం లక్ష్మిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు శ్రీధర్ రెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యపై ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చి నేరుగా పోలీసులపై, మంత్రి జూపల్లి కృష్ణారావుపై నిందారోపణలు చేయగా, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని మంత్రి జూపల్లి స్పందించారు. వ్యక్తిగత కారణాలతో జరిగిన హత్యకు రాజకీయ రంగు పులిమి, బీఆర్ఎస్ శవ రాజకీయాలు చేస్తోందని మంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు దారి తీసిన పరిణామాలు, వ్యక్తిగత, రాజకీయ కక్షలు, వివాహేతర సంబంధాలు, భూవివాదాలు, కుటుంబ సభ్యుల మధ్య ఉన్న తగవులపై విచారణ జరుపుతున్నారు. అయితే.. శ్రీధర్ రెడ్డి వ్యక్తిగత కారణాల వల్లే హత్యకు గురయ్యారని కొందరు అంటున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి వారి కుటుంబాల్లో భూ తగాదాల సమస్య ఉందని, వారిలో ఎవరో ఒకరు ఈ హత్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

**కాంగ్రెస్ లో కాక పుట్టించిన హత్య..**

జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్త హత్య అధికార పార్టీ కాంగ్రెస్ లో కాక పుట్టించింది. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడు గంగారెడ్డి హత్యకు గురయ్యారు. జగిత్యాల జిల్లా జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త గంగారెడ్డి హత్య రాజకీయంగా దుమారం రేపింది. అధికార పార్టీ కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు, గ్రూప్ రాజకీయాలను బహిర్గతం చేస్తుంది.

## విద్యపై కేంద్రం గుత్తాదిపత్యమా?

- ఉమ్మడి జాబితాలోని అంశంపై పెత్తనం చలాయిస్తామంటే కుదరదు
- రాష్ట్రాలు సామంత రాజ్యాలు కాదు
- దేశ పురోగతికి అవి జీవనాడీ
- ప్రజలకు అవసరమైన విద్య వ్యవస్థలను రాష్ట్రాలే నిర్మించుకుంటాయి
- తిరువనంతపురం జాతీయ ఉన్నత విద్య సమ్మేళనంలో డిప్యూటీ సిఎం

**చట్టం, హైదరాబాద్:** విద్య కేంద్రం గుత్తాధిపత్యం కాదని, ఇది ఉమ్మడి జాబితాలోని అంశం అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్ర మార్క అన్నారు. గురువారం కేరళ రాష్ట్రం తిరు వనంతపురం లో జరిగిన జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. ఆయా రాష్ట్రాలు వారి ప్రజలకు, వ్యవస్థలకు సరిపోయే విద్యాసంస్థలను, వ్యవస్థలను నిర్మించుకుంటాయని, ఒక రాష్ట్రా నికి మరో రాష్ట్రానికి పోలిక ఉండదన్నారు. స్వ యం ప్రతిపత్తి లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రం అందించలేదన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న అంశాన్ని చర్చలకు పరిమితం కాకుండా అంతా కలిసి నొక్కి చెప్పాల్సిన అవసరం ఉండ న్నారు. రాష్ట్రాలు ఒక ఉమ్మడి లక్ష్యంతో ఐక్యమై నప్పుడు కేంద్రం తప్పక వినాలన్నారు. మీరు బిల్లు చెల్లించాలి కానీ ఫుడ్ ఆర్డర్ చేయలేరన్న త రహాలో యుజిసి కొత్త నిబంధనలు ఉన్నాయని భట్టి అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, రా ష్ట్ర ప్రజల పక్షాన సమ్మేళనానికి హాజరైన వారం దరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియ చేస్తున్నానన్నారు. ఈ చర్చ ఎంతో విలువైనదిగా సీఎం రేవంత్ రెడ్డి భావించి, వారు ఈ సమ్మేళ నానికి రాలేకపోయినప్పటికీ రాష్ట్రాలు తమ సొంత విద్య భవిష్యత్తును రూపొందించుకోవడంతో స్వయం ప్రతిపత్తి కోసం బలమైన వాదన వినిపించేందుకు నన్ను పంపారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమ్మే ళనంలో యూజీసీ ముసాయిదా నిబంధనల ప్రభావం, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంలో చేపట్టిన కార్యక్రమాల గురించి డిప్యూటీ సీఎం ముందుగా ప్రసంగించి ఆ తర్వాత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చా రు. రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలకు నిధులు సమకూర్చడంతో పాటు నిర్వహించాలని మాత్రమే కేంద్రం భావిస్తు వైస్ ఛాన్సలర్ల నియా మకాల నుంచి అడ్మిషన్ల వరకు కీలకమైన నిర్ణ యాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తొలగిస్తున్నారని వివరించారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రాలు భవనాలు ప్రారంభించే రిబ్బన్ కటింగ్ అధికారా నికి మాత్రమే పరిమితమవుతాయన్నారు.



**రాష్ట్రాలు దేశ పురోగతికి జీవనాడి**

రాష్ట్రాలు కేవలం పరిపాలన విభాగాలుగా మాత్ర మే కాదని, అవి ఈ దేశ పురోగతికి జీవనాడి వంటివి అన్నారు. ఒక రాష్ట్ర విద్యార్థుల నాడి, అక్కడ యువత ఆకాంక్షలు, అధిగ మించాల్సిన ప్రత్యేక సవాళ్లు ఆ రాష్ట్రాలకే తెలుస్తాయన్నారు. విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేము, దానిని అవసరమైన చోట పెంపొందించాలి, రాష్ట్రాల అవసరాలకు అనుగు ణంగా విధానాలను రూపొందించాన్నారు. సహ కారం అంటే బలవంతం కాదు సంప్రదింపులు అని అర్థం, కేంద్రం నిజంగా సహకార సమాఖ్య వాదాన్ని విశ్వసిస్తే చర్చించాలి అన్నారు. రాష్ట్రాలు సహాయాన్ని అడగడం లేదు మన సరైన పాత్రను నొక్కి చెబుతున్నామని అన్నారు. రాష్ట్రా *ు ఐక్యంగా గళం విప్పితే ఆ ప్రతిధ్వనులు ఎంత దూరమైనా చేరుతాయని చరిత్ర మనకు చెబుతుందని వివరించారు. విద్య అంటే మనసు లను తెరవడానికి మార్గం, తలుపులు మూసి వేయడానికి కాదు, స్వయం ప్రతిపత్తి, సుపరిపా లన ద్వారా మనకు మాత్రమే కాదు రాబోయే తరాలకు కూడా తెరిచి ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు.


**వివరాలు 2వ పేజీలో..**


## ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తారా?

- శ్రీ రాజలింగమూర్తి హత్య వెనుక బిఆర్ఎస్ నేతల హస్తం
- కిరాయి గూండాలతో చంపించారు
- నిప్పులు చెరిగిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**చట్టం, హైదరాబాద్:** బిఆర్ఎస్ దోపి ప్రశ్నించిన రాజలింగమూర్తిని దారుణంగా హత్య చేశారని, ఈ హత్య వెనుక కెసిఆర్, కెటి ఆర్, హరీశ్ రావుల పాత్ర కీలకంగా ఉందని రో డ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రె డ్డి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి కిరాయి గూండాలతో ఈ హత్య చేయించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ రోపించారు. గురు వారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ ఫ్యామిలీ అక్రమాలను బయటపెడితే చంపేస్తారా..? అని ఆయన ప్రశ్నించారు. పదేళ్లు దోచుకున్న బిఆర్ ఎస్ పార్టీ ఇప్పుడు హత్యా రాజకీయాలు ప్రారం భించిందన్నారు. కాళేశ్వరంలో కెసిఆర్కు శిక్ష పడుతుందని కెటిఆర్ ఆదేశాలతోనే మాజీ ఎమ్మె ల్యే గండ్రావెంకటరమణారెడ్డి తన భర్తను హత్య చేయించారని మృతుడి భార్య, కూతురు ఆరోపి స్తుంటే గండ్ర వెంకటరమణారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి పోలీసులకు లొంగిపోమని చెప్ప కుండా హరీశ్ రావు ప్రెస్ మీట్ పెట్టి కృష్ణా వా టర్ అంటూ డైవర్ట్ చేస్తున్నారని మంత్రి కోమటి రెడ్డి మండిపడ్డారు. హరీశ్ రావు నీవు మనిషివే నా? నీకు మానవత్వం ఉందా అని మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. హత్య కేసును సిబిసిఐడీ విచారణకు అప్పగించాలి రాజలింగమూర్తి హత్య కేసును సిబిసిఐడీ విచారణకు అప్పగించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు సత్వరమే శిక్ష పడేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఈ హత్యను సిఎం రేవంత్ రెడ్డి కూడా సీరియస్గా తీసుకున్నారని ఆయన చెప్పారు. తెలంగాణలో హత్యా రాజకీయాలకు తావు లేదన్నారు. కాళేశ్వరంలో కెసిఆర్కు దోషిగా శిక్ష పడుతుందని కెసిఆర్, కెటిఆర్ హత్య చేయించారని రాజ లింగమూర్తి కూతురు, భార్య చెబుతున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. అడ్వకేట్ వామన్ రావు దంపతుల హత్య కేసులో నిందితు లకు బిఆర్ఎస్ టికెట్ ఇచ్చిందని మంత్రి గుర్తు చేశారు. వరంగల్లో ఎంపిడిఓను బిఆర్ఎస్ వాళ్లే హత్య చేశారని అప్పటి సిపి రంగనాథ్ చెప్పారని మంత్రి కోమటిరెడ్డి గుర్తు చేశారు. కెసిఆర్ కిరాయి హత్యలు చేయించడమే తప్ప కెసిఆర్తో ఏమీ కాదని మంత్రి కోమటిరెడ్డి దుయ్య బట్టారు. కెసిఆర్ 15 నెలల నుంచి ఫాంహౌస్ నుంచి ఎప్పుడైనా బయ టకు వచ్చారా? అని ఆయన నిలదీశారు. అగచర్లలోనూ కలెక్టర్పై హత్యాయత్నానికి పాల్పడింది బిఆర్ఎస్కు చెందిన సురేశ్ అని ఆయన పేర్కొన్నారు. ఆయనపై రౌడీ షీట్ కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. కాం గ్రెస్ గ్రాఫ్ తగ్గిందని కెసిఆర్ అంటున్నారని, హత్యలు రాజకీ యాగే మీ గ్రాఫా..? అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కిరాయి హత్యలు చేయించడం తప్ప కెసిఆర్ తో ఏమీ కాదని మంత్రి అన్నారు. అవినీతిపై పోరాడే వారికి తమ ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. హరీశ్ రావు మీద పోరాటం చేస్తున్న చక్రధర్ గౌడ్ కు రక్షణ కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.

2

@ChattamTV

శుక్రవారం

21.02.2025

CHATTAM NEWS

చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ ..



**చట్టం, తిరుమల :** కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి 12 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 14 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు.నిన్న స్వామివారిని 72,745 మంది భక్తులు దర్శించుకోగా 24,156 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.48 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

**కపిలేశ్వరస్వామివారి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు**

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు గురువారం శ్రీ కపిలేశ్వర స్వామివారు సూర్యప్రభ వాహనంపై కటాక్షించారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం శ్రీ సోమస్కందమూర్తి, శ్రీకామాక్షి దేవి అమ్మవారికి స్నపన తిరుమంజనం ఘనంగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లకు జియో ఫెన్సింగ్




**చట్టం :** గతంలో మాదిరిగా పాత ఇళ్ల పేరిట బిల్లులు తీసుకోవడం, ఇళ్లు నిర్మించకున్నా నిర్మించినట్లు బిల్లులు తీసుకోవడం వంటి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు జియో ఫెన్సింగ్ చేయాలని నిర్ణయించింది. ఈసారి ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు జరిగినట్లు తేలితే ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులు ఇవ్వమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం జియో ఫెన్సింగ్ విధానం అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. దీని కోసం కృతిమ మేధ (ఏఐ) సాయంతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేశారు. ఇంది రమ్మ ఇళ్లతో దీన్ని అమల్లోకి తేనున్నారు.గతంలో మాదిరిగా పాత ఇళ్ల పేరిట బిల్లులు తీసుకోవడం, ఇళ్లు నిర్మించకున్నా నిర్మించినట్లు బిల్లులు తీసుకోవడం వంటి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు జియో ఫెన్సింగ్ చేయాలని నిర్ణయించింది. ఈసారి ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు జరిగినట్లు తేలితే ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులు ఇవ్వమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం జియో ఫెన్సింగ్ విధానం అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. దీని కోసం కృతిమ మేధ (ఏఐ) సాయంతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేశారు. ఇంది రమ్మ ఇళ్లతో దీన్ని అమల్లోకి తేనున్నారు.

## రూ.2కోట్లకు చేరిన బకాయిలు




**చట్టం :** మునిసిపాలిటీకి ఏటా లభించే ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన ఐడీఎస్ఎంటీ మునిసిపల్ దుకాణాల అద్దె బకాయిలు పేరుకు పోతున్నాయి. పలువురు యజమానులు ఏళ్ల తరబడిగా అద్దెలు చెల్లించకపోవడంతో మునిసిపల్ ఆదాయానికి భారీగా గండి పడింది. వాస్తవానికి ఏటా రావాల్సిన అద్దెల్లో 2/3 వంతు ఆదాయం బకాయి రూపంలోనే మిగిలిపోతుండటం సమ స్యగా మారింది. దీని ప్రభావం పలు అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టంగా కనిపిస్తున్నా.. రాజకీయ జోక్యంతో అధికారులు మిన్నకుండిపోయే పరిస్థితి తలెత్తింది. మునిసిపల్ కౌన్సిల్ పాలన గడువు ముగిసి ఇటీవలే కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పా లన అధికారి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఇ ప్పటికైనా అద్దె బకాయి వసూలుపై దృష్టి సారిం చాల్సి ఉంది. పట్టణ పరిధిలో పలు బ్లాక్‌ల వారీగా మొ త్తం 333 దుకాణాలు ఉండగా వాటి ద్వారా ఏటా రూ.2.79కోట్ల వరకు అద్దె వసూలు కా వాల్సి ఉంది. 202425 ఆర్థిక సంవత్సరం చి వరి నాటికి రూ.1.76కోట్ల వరకు ఏరియర్స్ రూపంలో బకాయిగా మిగిలింది. ప్రస్తుత ఆర్థి క సంవత్సరంలో కరెంట్ డిమాండ్ (నడుస్తున్న ఆర్థిక సంవత్సరం) రూ.2,79,04,191 కాగా రూ.1,76,15,900 ఏరియర్స్ రూపంలో ఉన్నవి కలిపి మొత్తం రూ.4,55,20,091 వసూలు చేయా ల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.1.65కోట్ల మేరకు మాత్రమే వసూలు కాగా, మిగతా సొమ్ము వసూలు కోసం బిల్ కలెక్టర్లు నా నా తంటాలు పడాల్సిన పరిస్థితి తలెత్తింది. గత నెలలో ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్య క్రమంలో పట్టణ మునిసిపాలిటీలోని అన్ని విభా గాల్లో పని చేసే సిబ్బందిని వినియోగించుకోగా దాదాపు నెలరోజుల పాటు ఆస్తి పన్ను వసూలు నిలిచి పోయింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 40 రోజుల్లోగా దాదాపు రూ.3 కోట్ల వరకు దుకాణాల అద్దె వసూళ్లు చేసేలా సిబ్బం దిపై ఒత్తిడి పెరిగింది.

## ఆసుపత్రి దశ మారేనా?




**చట్టం, కోయిలకొండ:** గత నైజాం కాలం 1890లో ప్రారంభమైన కోయిలకొండ ప్రభుత్వ ఆసుపత్రికి గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వ హయాంలో రూ.7 కోట్లతో వంద పడకల సామర్థ్యం గల అధునాతన ఆసుపత్రి నిర్మాణం జరిగినా.. ఏరియా ఆసుపత్రిగా, పీహెచ్‌సీగా గుర్తింపు లేని ఆసుపత్రిగా చరిత్రలో నిలిచింది. దీంతో ఆసుపత్రిలో డాక్టర్లు, సరిపడా సిబ్బంది లేరు. ఆసుపత్రికి వైద్యం కోసం వస్తే పారసిటమాల్ తప్ప.. ఇతర మందులు దొరకని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రికి మందులు కావాలంటే కొతలాబాద్ పీహెచ్‌సీపై ఆధారపడాల్సిన పరిస్థితి. కోయిలకొండ ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో కలిపి సిబ్బంది, వైద్య పరికరాలు అందించాలని వైద్యరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మను నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పలుమార్లు వినతిపత్రం అందించినా ఆసుపత్రి అభివృద్ధిలో ఎలాంటి మార్పురాలేదు. గత అక్టోబరు 24న తెలంగాణ వైద్య డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ కోయిలకొండ ఆసుపత్రిని సందర్శించి, ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా.. ఇప్పటికీ నెరవేరలేదు. ప్రస్తుతం ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు ఏఎన్ఎంలతో ఆసుపత్రిని నిర్వహిస్తుండగా ఆసుపత్రిలో బీసీ మిషన్ తప్ప ఎలాంటి పరికరాలు లేవు. రక్త పరీక్షలు నిర్వహించాలన్నా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట పర్యటనతో కోయిలకొండ ప్రభుత్వ ఆసుపత్రి దశ మారుతుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వరాల జల్లు కురిసేనా..?



**చట్టం:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నారాయణపేట పర్యటన నేపథ్యంలో జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నారాయణపేట జిల్లాకు వరాల జల్లు కురిసేనా అని ఎదురు చూస్తున్నారు. జిల్లాలో ప్రవేశించిన కృష్ణానది చెంతనే ఉన్నా సాగునీరు లేక ఈ ప్రాంతం ఎడారిగా మారి వలసలకు నిలయంగా పేరొందింది. ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తో రూ.2,945 కోట్లతో పేటకొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. కరువు ప్రాంతాలైన కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియో జకవర్గాలకు సాగునీటిని అందించేందుకు గత ఏడాది 2024 ఫిబ్రవరి 21న సీఎం రేవంత్‌రెడ్డి పథకం పనులకు కొడంగల్‌లో శంకుస్థాపన చేశారు. నాటి బహిరంగ సభలో పథకాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు కూడా. పథకం శంకుస్థాపనకు నేటితో ఏడాది పూర్తి అవుతుంది. ప్రస్తుతం ఈ పథకంలో సంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గాను భూసేకరణ కోసం అధికారులు సర్వే చేస్తున్నారు. సర్వేలను దామరగిద్ద తండా, పేరపళ్ల తదితర ప్రాంతాల రైతులు పలుచోట్ల అడ్డుకుంటుండడంతో ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. ముందస్తు నోటీలు ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారంటూ గ్రామస్థులు అధికారులను నిలదీస్తున్నారు. ఇక కోటకొండ, కాన్‌కుర్తి, గార్ల పాడ్‌లను కొత్త మండలాలుగా చేస్తామని ఎన్నికల ముందు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఇచ్చిన హామీ సీఎం నెరవేరుస్తారా అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. కోయిల్‌కొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండలానికి సాగునీరు, 50 పడకల ఆసుపత్రి నిర్మాణం, మరికల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధన్వాడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వంత భవనం, ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ, పేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల, సైనిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు, జిల్లా జనరల్ ఆసుపత్రి నూతన నిర్మాణం పెండింగ్‌లో పడిపోయాయి. కొడంగల్, నారాయణపేట జంట నగరాలు తనకు రెండు కళ్లు అని.. ఈ నగరాలను సమానంగా అభివృద్ధి చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.





## ప్రత్యేక అభివృద్ధికే నుడా ఏర్పాటు..జిల్లా అభివృద్ధి యే నా లక్ష్యం.!!

- **రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రం సుభిక్షం**
- **రాష్ట్రం అప్పుల కుప్పగా ఉన్నా..అభివృద్ధికి వెనకాడని ప్రభుత్వం**
- **ఆరు గ్యారంటీలు అమలు చేస్తం..అర్హులందరికీ సంక్షేమ ఫలాలు..**

**నిజామాబాద్ జిల్లా నుడా చైర్మన్ కేశవేణు**

**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా ప్రత్యేక అభివృద్ధికి గాను నుడా ఏర్పాటు చేయడంతో మరింతగా అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల పని చేస్తానని, జిల్లా ప్రత్యేక అభివృద్ధియే తన లక్ష్యమని నిజామాబాద్ జిల్లా నుడా చైర్మన్ కేశ వేణు చట్టం దినపత్రిక జిల్లా ప్రతినిధితో ముఖాముఖిలో పేర్కొన్నారు. నిజామాబాద్ నుడా పరిదిలో ప్రస్తుతం 188 గ్రామాలు అనుసంధానం అయి ఉండగా బోధన్,ఆర్మూర్,భీంగల్ మండలాలతో పాటు నిజామాబాద్ కార్పోరేషన్ నుడా పరిదిలోకి తీసుకొచ్చారు. ఆయా గ్రామ పంచాయితీల పరిదిలో లేని అనుమతులు తప్పనిసరిగా నుడా అనుమతి పొందాల్సి ఉంటుంది. 600 గజాల పైబడి స్థలంలో నిర్మాణం చేపట్టాలనుకుంటే నుడా అనుమతి పొందాలి. అందుకు గాను 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా వచ్చిన ఆదాయంతో జిల్లా అభివృద్ధికి వినియోగించుకోవాల్సి ఉంటుంది.



**నుడా పరిదిలోని ప్రత్యేక అభివృద్ధి పనులు**

నుడా పరిదిలోని ప్రత్యేక అభివృద్ధి పనులు చేసేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి వచ్చే ఆదాయంతో సెంటర్ లైటింగ్,మురికి కాలువలు,పార్కుల ఏర్పాటు, నూతన రహదారుల నిర్మాణం,సీనియర్ సిటిజన్ కొరకు పార్కులు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా అక్రమ నిర్మాణాలు,కబ్జాలపై ప్రత్యేక చర్యలు తీసుకుని భూ కబ్జాలకు పాల్పడకుండా ప్రభుత్వ భూమిని కాపాడుకుంటాం. గత ప్రభుత్వ హయంలో అక్రమార్కులు దర్జాగా భూ కబ్జాలను చేపట్టారని జిల్లా ప్రజలకు తెలుసనీ అన్నారు. భూ కబ్జాకోరులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రత్యేక అభివృద్ధికి శాయా శక్తులు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం..అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఒక సంవత్సర కాలంలో పాలన చాల బాగుంది. రాష్ట్రం అప్పుల కుప్పగా ఉన్నా అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెనకాడటం లేదు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తాం..అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయి. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు,ఉచిత కరెంటు,రూ. 500 లకే గ్యాస్ పంపిణి, రూ.2 లక్షల రుణ మాఫీ, మహిళకు ప్రతి నెల 2500 రూపాయల పథకం కొద్ది రోజుల్లో అమలు చేస్తాం అని అన్నారు. అదేవిధంగా ఆరోగ్య శ్రీ రూ. 10 లక్షలకు పెంపుదల చేసి పేద ప్రజల పాలిత వరంగా మారిందని అన్నారు. గత ప్రభుత్వం కమిషన్ల కొరకు అనవసర సంక్షేమ పథకాల పేరుతో డబ్బులను వృధా చేయడం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది.



**బీసి కుల గణనతో సిఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కల సాకారం**

గత ప్రభుత్వాలు చేపట్టిన సర్వేలతో బిసిలకు అన్యాయం జరిగింది. బీసిల సంఖ్య తక్కువగా చూపించి రాజ్యాధికారం చేపట్టకుండా అడ్డుకున్నారు. అందుకే సిఎం రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీ బిసిలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించాలనే ఉద్యేశ్యంతో బీసి కుల గణన చేపట్టారు. రెండవసారి బీసి కుల గణన సైతం చేపట్టేందుకు అధికారులకు ఆదేశించారు. ఎవరైనా కుల గణనలో పాల్గొనని కుటుంబాలు ఉంటె మరో అవకాశం కల్పించాలని అందరికి న్యాయం జరగాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు పేర్కొన్నారు.

**స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాదిస్తుంది**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాదించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సొంత పార్టీలో కుమ్ములాట వాస్తవమే..ఈవన్ని పార్టీల్లో సహజం. అందరి ఆలోచన విధానం ఒకేలా ఉండదు కావున అలాంటి పరిస్థితి ఎదుర్కొన్న పార్టీకి కార్యకర్తలు,ప్రజలు బలంగా,విశ్వాసంతో ఉన్నారని అన్నారు. సిఎం ను మార్చే ఆలోచన అధిష్టానంకు లేదని, ప్రతి పక్ష నేతలు,పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు.


### మరో 5 సంవత్సరాలు రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలిస్తుంది

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని మరో 5 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ పాలిస్తుందని అన్నారు. కోట్లాది సాదించుకున్న తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం దోచుకుందని అన్నారు. నీళ్లు , నిధులు,నియామకాలు పేరుతో సాదించుకున్న తెలంగాణలో ఒక్క నియామకం చేపట్టక పోవడం సిగ్గు చేటని అన్నారు. ఇంతలా ప్రజల సొమ్ముని కాజేసిన కేసిఆర్ కుటుంబం తెలంగాణను అభివృద్ధి చేసినట్లు చెప్పుకుంటున్నారు. ప్రతి పక్ష నేత హోదా ఉండి కూడా ఒక్క రోజు కూడా అసెంబ్లీ కి రాకుండా ఉన్నారు. గతంలో గ్రమాలలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద కుటుంబాలకు ఇచ్చిన ఇందిరమ్మ గృహాలు ఉన్నాయని అన్నారు. అంతే కాకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. రూ.7.5 లక్షల కోట్లు అప్పుతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నా రేవంత్ రెడ్డి పాలన కు ప్రజలు జేజెలు పలికుతున్నారని అన్నారు. పేద వారికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాము. మంచి నీటి సమస్యను పూర్తిగా నివారణకు పక్క ప్రణాళికలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున కోడ్ ముగియగానే మంచి నీటి ట్యాంకులు ప్రారంభించుకుంటామని అన్నారు.

## విద్యపై కేంద్రం గుత్తాదిపత్యమా?

**చట్టం:** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలో విద్యారంగంలో చేపట్టిన సంస్కరణ లు, ఫలితాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ సీఎం వివరించారు. విద్య, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కేంద్రం గౌరవించాలని తెలిపారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి పై అత్యున్నత న్యాయస్థానం రాజస్థాన్ వర్సెస్ భారతీయ యూనియన్ కేసు లో భారతదేశం ఒక సమాఖ్య రాజ్యాంగ ఉందని పేర్కొన్న అంశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటే షన్ లో వివరించారు. కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్రం కేసులో 'సమాఖ్య వ్యవస్థ భారత రాజ్యాంగంలోని ప్రామాణిక లక్షణం అని పేర్కొన్న సందర్భాన్ని డిప్యూటీ సీఎం సమ్మేళ నంతో ఉదహరించారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం, సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తొలగించడం, వైస్ ఛాన్సలర్ల అర్హత ప్రమాణాలను మార్చడం ఆందోళనకర అంశం అన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష తప్పనిసరి చేయడం మూలంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీల వైస్ ఛాన్స లర్ల నియామకం, సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తొలగించడం, వైస్ ఛాన్సలర్ల అర్హత ప్రమాణాలను మార్చడం ఆందోళనకర అంశమ న్నారు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశా నికి ప్రవేశ పరీక్ష తప్పనిసరి చేయడం మూ లంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థు FV ఉన్నత విద్యకు దూరమవుతారన్నారు. భార తదేశంలోని అన్ని రాష్ట్రాలు కలిసి నిజమైన సమాఖ్య ఆత్మకు రూపం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తదుపరి సమావేశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని తద్వారా రాష్ట్రాల తరపున కార్యాచరణ ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంటుందని తెలిపారు. భారత దేశ ప్రజాస్వా మిక లక్షణమే వైవిధ్యం అని, ఈ ప్రాథమిక లక్ష ణాన్ని దెబ్బతీయకూడదన్నారు. సరైన మార్గాన్ని ఎంచుకునే అవకాశం రాష్ట్రాలకు ఉందని, సరైన నిర్ణయం తీసుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సమ్మేళనం లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.ఈ సమ్మేళనంలో కేరళ సీఎం. పిన రయీ విజయన్, కేరళ ఉన్నత విద్య శాఖ మంత్రి ఆర్. బిందు, కర్ణాటక మంత్రి ఎం.సీ. సుధాకర్ అవారే, తమిళనాడు నుంచి తిరుగోవి చేజియాన్, పంజాబ్ నుండి సర్దార్ హరోజ్ సింగ్ తోపాటు ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు.

## మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన



**చట్టం, నిడమనూరు:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట మూడు గంటల పాటు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలకేంద్రంలో గురువారం జరిగింది. మండలంలోని గుంటుగూడెం గ్రామానికి చెందిన గోపిశెట్టి శ్రీనయ్య(57) గత నెల 2వ తేదీన మండలకేంద్రానికి వచ్చి పని ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరుగుపయనమయ్యాడు.గుంటుకగూడెముప్పారం రోడ్డులో మూలమలుపు వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న సీబీజడ్ వాహనం ప్రమాదవశాత్తు శ్రీనయ్యను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం తొలుత మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యంకోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని కాచిగూడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నెలన్నర రోజులకు పైగా చికిత్సపొందుతూ శ్రీనయ్య గురువారం మృతిచెందాడు. ఆస్పత్రిలో శ్రీనయ్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. ప్రమాదానికి కారణమైన మండలంలోని వడ్డెరగూడెం గ్రామానికి చెందిన గోగుల మహేష్‌ను పిలిపించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట సుమారు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పిలిపించి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని ఎస్ఐ గోపాల్‌రావు చెబుతున్నా ఆందోళనకారులు ససేమిరా అంటూ ఆందోళన కొనసాగించారు. దీంతో సంఘటన గురించి ఎస్ఐ ఉన్నతాధికారులకు వివరించడంతో హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్ సంఘటనాస్థలానికి వచ్చి ఆందో ళన చేస్తున్న వారితో మాట్లాడారు. గత నెల 12వ తేదీన శ్రీనయ్య కుమార్తె లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన మహేష్‌ను శుక్రవారం స్టేషన్‌కు పిలిపించి బాధితులకు న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## పైర్లు ఎండుతున్నా పట్టించుకోరా?



**చట్టం, ఆత్మకూర్(ఎస్):** నీటిపారుదల శాఖ అధికారుల తీరుతో గోదావరి జలాలు రాక పైర్లు ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని సూర్యాపేటదంతాలపల్లి ప్రధాన రహదారి కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ వంతెనపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆత్మకూరు(ఎస్) మండలం కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ డీబీఎం71కు నీటిపారుదల శాఖ అధికారులు నాలుగు రోజుల క్రితం నీటిని విడుదల చేశారని, నేటికీ పెన్‌పహాడ్ మండలానికి నీళ్లు చేరలేదన్నారు. వారబందీ ప్రకారం ఈ నెల 16న గోదావరి జలాలు విడుదల చేసిన అధికారులు ప్రధాన కాలువకు నీటిని అందించకుండా 36ఎల్ కాల్వ ద్వారా మోతె మండలానికి మాత్రమే నీళ్లు తరలించడంపై నిరసన వ్యక్తం చేశారు. అధికారులు నీటి సరఫరాలో పక్షపాతం చూపిస్తున్నారని రాత్రి వేళల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మెయిన్ కాలువ గేట్లు మూసి నీటిని మళ్లిస్తు న్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు 10రోజుల క్రితం ప్రధాన కాల్వ గేట్లకు ఏకంగా వెల్డింగ్‌లు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వదిలిన కొద్ది నీరైనా అన్ని ప్రాంతాల రైతులకు సమానంగా చూడాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## డోలీ కష్టాలు తీరవా!



**చట్టం, కొయ్యూరు:** ఏజెన్సీలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నట్టు పాలకులు చెబుతున్నప్పటికీ.. మారుమూల గ్రామాల ఆదివాసీలకు డోలీ మోతల ఇక్కట్లు తొలగడంలేదు. గర్భిణులు, తీవ్రఅనారోగ్యానికి గురైన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే డోలీ కట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది. మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబంధ గ్రామానికి చెందిన నిండు గర్భిణి కొర్ర శాంతికి గురువారం ఉదయం పురిటినొప్పులు మొదలయ్యాయి. గ్రామానికి రహదారి సదుపాయం లేకపోవడంతో అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. కుటుంబ సభ్యులు డోలి కట్టి, ఆరు కిలోమీటర్ల దూరంలోని పిత్రిగెడ్డ వరకు మోసుకొచ్చారు. అక్కడ నుంచి అంబులెన్సులో డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం వైద్యులు సాధారణ ప్రసవం చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. బాలింత, శిశువు ఆరోగ్యంగానే వున్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా జాజులబంద గిరిజనులు విలేకరులతో మాట్లాడుతూ, తమ గ్రామానికి రహదారి నిర్మాణం కోసం 2023లో ఐటీడీఏ అధికారులు ఉపాధి హామీ పథకం కింద రూ.కోటి మంజూరు చేశారన్నారు. రూ.28 లక్షలు వెచ్చించి నాలుగు కల్వర్టులు నిర్మించి వదిలేశారని, రహదారిని ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. రహదారి నిర్మించి వుంటే తమకు డోలీ కష్టాలు వుండేవి కావని చెప్పారు.

## టెన్త్ క్లాస్ పేపర్ లీక్.. హిందీ, సైన్స్ పరీక్షలు రద్దు

**చట్టం:** నాలుగు లక్షల మందికిపైగా విద్యార్థులు రాస్తున్న టెన్త్ బోర్డ్ ఎగ్జామ్ పేపర్ లీకైంది. పరీక్షకు ముందే అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకున్న అధికారులు రెండు పరీక్షలను రద్దు చేశారు. ఆ విశేషాలేంటో ఇక్కడ చూద్దాం.ఇటీవల బిహార్ బీపీఎస్సీ ఎగ్జామ్ పేపర్ లీక్ వివాదం మరువక ముందే, తాజాగా జార్ఖండ్‌లో టెన్త్ బోర్డు పరీక్షల పేపర్స్ లీకయ్యాయి (Jharkhand Board Exam). అందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో జార్ఖండ్ అకడమిక్ కౌన్సిల్ 10వ తరగతి హిందీ, సైన్స్ సబ్జెక్టుల పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే హిందీ పరీక్ష ఫిబ్రవరి 18న జరుగగా, సైన్స్ పరీక్ష ఫిబ్రవరి 20న జరగాల్సి ఉంది. ఈ రెండు సబ్జెక్టుల పునఃపరీక్షల తేదీలను తరువాత ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
@ChattamTV
శుక్రవారం
21.02.2025





## బేబీకి ఏ పాజిటివ్ రక్తదానం

**చట్టం ,నిర్మల్ ప్రతినిధి** : నిర్మల్ జిల్లా కేంద్రం లోని ముస్లిం కమ్యూనిటీ సంఘం ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల అయేజా సుల్తానా పాప రక్త హీనతతో బాధపడుతుంటే రాజు కు సమాచారం అందించగా వెంటనే స్పందించి మానవత దృక్పథంతో కావేరి బ్లడ్ కు వచ్చి రక్తం అందజేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు షేక్ ముజాహిద్, కావేరి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు, హాజీ మస్తాన్ తదితర సభ్యులు ప్రత్యేక అభినందనా కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించండి...

- హెల్మెట్ ధరించండి లోనికి ప్రవేశించండి..!
- సిద్ధిపేట రవాణా శాఖ

**చట్టం సిద్ధిపేట ప్రతినిధి** : రోడ్డు భద్రతా నియమాలు పాటించండి హెల్మెట్ ధరించండి ఇది మన ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని మోటర్ వెహికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ సూచించారు. గురువారం రవాణా శాఖ కార్యాలయంలో ప్రధాన గేట్ వద్ద కార్యాలయంలోకి వచ్చే మోటర్ వాహనదారులను హెల్మెట్ ధరించకుండా వచ్చిన వారిని హెల్మెట్ యొక్క భద్రతా ట్రాఫిక్ నియమాలపై వారికి పలు సూచనలు చేశారు.. అనంతరం మాట్లాడుతూ.. వాహనదారులు ఆర్టీవో కార్యాలయం వచ్చిన వారికి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రయాణం ఎంత ముఖ్యమో గమ్యస్థానం చేరడం కూడా అంతే ముఖ్యమని మోటార్ సైకిల్ పై ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏట్టి పరిస్థితుల్లోనూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయవద్దని మనకోసం మన కుటుంబం ఆధార పడి ఉంటుందని మన ప్రాణానికి నష్టం జరిగితే కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడం జరుగుతుందని




అన్నారు. ప్రతి ఒక్కరూ మోటార్ సైకిల్ కు సంబంధించిన అన్ని దృవపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని మోటర్ వెహికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో జిల్లా వ్యాప్తంగా హెల్మెట్ ధరించకుండా 45 మంది మృతి చెందారని గుర్తు చేశారు. నిత్యం రోడ్డు ప్రమాదాల ద్వారా అనేక మంది మోటార్ సైకిల్ ప్రయాణికులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతున్నారని తెలిపారు. దీనికి ప్రధాన కారణం వారు తలకు హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రాణాలను కోల్పోతున్నారని. రవాణా శాఖ అధికారులు ప్రజలకు రక్షణను దృష్టిలో ఉంచుకొని వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆర్టీవో కార్యలయం కు వచ్చే వాహన చోదకులు తప్పని సరిగా ఎల్మెట్ ధరించి ఆర్టీవో కార్యాలయం కు రావాలని ఆర్టీవో అధికారులు పిలుపునిచ్చారు.

## పోస్టు మెట్రిక్ హాస్టల్ ఉద్యోగులకు కన్వెన్షన్ జీవో వర్తించే లా చేయాలి..



**చట్టం సిద్ధిపేట ప్రతినిధి** :బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో ఔట్సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్ లో పని చేస్తున్న తమకు కన్వెన్షన్ జీవో వర్తించే విధంగా చేసి తమ జీతాలను ఇప్పించాలని బాధితులు కోరారు. గురువారం సిద్ధిపేట పట్టణంలోని ప్రెస్ క్లబ్ జరిగిన సమావేశం వారు మాట్లాడారు.బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో ఔట్సోర్సింగ్ విధానంలో పోస్టు మెట్రిక్ హాస్టల్ లో 49 మంది వర్కర్స్ పనిచేయగా 28 మందికి మాత్రమే కంటిన్యూషన్ జీవో ఇచ్చి మిగిలిన 21 మంది ఉద్యోగులకి వచ్చిన కంటిన్యూషన్ జీవో వర్తించేలా సంబంధిత బీసీ వెల్ఫేర్ మినిస్టర్ సంబంధిత జిల్లా అధికారులు ఈ సమస్య పైన పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించి ఉద్యోగుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాల్సిందిగా రాష్ట్ర జేఏసీ సిద్ధిపేట జిల్లా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి శ్రీకాంత్, ఈ పతి లక్ష్మి, కల్యాణి, యశోద, డి.జ్యోతి, ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



**చట్టం న్యూస్ మోస్రా /చందూర్** : నిజామాబాద్ జిల్లా చందూర్ గ్రామాభివృద్ధి కమిటీని గ్రామ ప్రజల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులు మద్దూరి శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షులు పెంట గంగారం, నీరడి గంగారాం, కోశాధికారి గుర్ల చిన్న సాయిలు, కార్యదర్శిగా వీరసారపు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిలుగా షేక్ హైమద్, అంగాల యోగేశ్వర్ గౌడ్ లను ఎన్నుకోవడం జరిగింది. కమిటీ సభ్యులుగా ఒక్కో కుల సంఘాల నుండి ఒక్కరిని నియమించుకున్నారు. ఈ యొక్క కమిటీ నిర్మాణానికి ముందు ఉండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన చందూర్ గ్రామ ప్రజలకు నూతనంగా ఎన్నుకోబడ్డ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శుభాకాంక్షలు తెలిపారు.

## మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షునిగా మహమ్మద్ జహంగీర్



**చట్టం ముస్తాబాద్** : మానవ హక్కుల కమీషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ జహంగీర్ నియమించినట్టు జాతీయ అధ్యక్షుడు షేక్ గౌస్ తెలిపారు.ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ తను గత 30 సంవత్సరాలుగా సుదీర్ఘంగా ప్రజా జీవితంలో ఉన్నానని ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నానని, తను బ్రతుకుదెరువుకు ఎడారి దేశం వెళ్లిన అక్కడికి వచ్చిన మన దేశ కార్మిక సోదరులకు జరుగుతున్నటువంటి అన్యాయాలపై స్పందిస్తూ అక్కడి ప్రభుత్వంతో పోరాటం చేశానని, మన ప్రాంతానికి వచ్చిన తర్వాత కూడా అదే పోరాటాన్ని నిత్యం కొనసాగిస్తున్నానని, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజల పక్షాన ప్రజా హక్కులకు ఎక్కడ భంగం కలిగినా ప్రజల గొంతుకై పోరాటం చేస్తానని, పీడిత ప్రజల పక్షాన వారి హక్కుల సాధనే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ఈ అవకాశం కల్పించిన అంతర్జాతీయ మానవ హక్కుల కమీషన్ అధ్యక్షుడికి, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## పట్టభద్రుల ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ పార్టీ కు లేదు




**చట్టం న్యూస్ మోస్రా** : నిజామాబాద్ జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలో బిజెపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ అభ్యర్థి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేశాకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలు ఏమైందని, నిరుద్యోగ భృతి ఇవ్వని కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు అడిగే అర్హత లేదన్నారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతు ఢిల్లీలో బీజేపీ విజయం సాధించిందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల జిల్లా ఇన్చార్జి పెద్దోళ్ల గంగారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, గుడుగుట్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శంకర్ గౌడ్, కోణాల గంగారెడ్డి, చిదుర సాయిలు, దొరబాబు, మోహన్ రెడ్డి, బాపురెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆర్థిక సహకారంతో ఆలయ నిర్మాణం



**చట్టం బోథ్** :గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి దేవాదాయ శాఖ మంత్రి వర్యుల చొరవతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ బోథ్ మండలంలోని సాయి నగర్ లో గల అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. గురువారం నిర్మాణం పూర్తి చేసుకుని విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్,పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్,మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, మండల రైతు సంఘం అధ్యక్షుడు బోడ్డు శ్రీనివాస్,బోథ్ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్,రమణ గౌడ్,రఫీ,రమణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొరు.

## ఆహార కల్తీ మహమ్మారి పై చైతన్య సదస్సు




**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి** :నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ అధ్యక్షాకార్యదర్శిలు మరోజు సుధాకర్ చారి, సల్లుర్వార్ అశోక్ చారి ల ఆధ్వర్యంలో బోధన్ డివిజన్ అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార కల్తీ అయోడిన్ ఉప్పు లో ప్లాస్టిక్ అంశము పై చైతన్య సదస్సు జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ, ఆహార కల్తీ మహమ్మారి రోజు రోజుకు విజృంభిస్తున్న క్రమంలో వినియోగ దారులుగా అందరూ చైతన్య వంతులు కావాలని అన్నారు. ఉప్పు, పప్పులు, వంటనూనెలు మొదలుకొని వివిధ రకాల అయోడిన్ ఉప్పు లు ప్లాస్టిక్ సంచుల్లో అమ్మకం జరుగుతున్నందున మైక్రో ప్లాస్టిక్ కడుపులోకి చేరడం, క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ ప్యాకింగ్ వలన అయోడిన్ ఉప్పు లక్ష్యం వృధాఅయిపోతున్నదని, కాబట్టి అన్ని రకాల ఉప్పు తయారీ దారులు ప్లాస్టిక్ కవర్ లలో ప్యాకింగ్ చేయరాదని తెలిపారు. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం 2013 నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలను ఒక వేళ ప్యాకింగ్ లో చేస్తే, ఆ ప్లాస్టిక్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలు ప్యాకింగ్ పై ముద్రించాలని తెలిపారు. కాని వివిధ రకాల అయోడిన్ ఉప్పు తయారీ సంస్థలు నాసిరకం ప్లాస్టిక్ కవర్ లలో ఉప్పు ప్యాకింగ్ చేసి, చిన్న పిల్లలతో సహా అందరికీ క్యాన్సర్ రావడానికి కారణం అవుతున్నారని సాంబరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వి.యన్.వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, బోధన్ అధ్యక్షకార్యదర్శులు మరోజు సుధాకర్ చారి, సల్లుర్వార్ అశోక్ చారి, రూరల్ ఇంచార్జీ కార్యదర్శులు యాటకర్ల దేవేష్, గైని రత్నాకర్, మహాదేవుని శ్రీనివాస్, అంగన్వాడీ సీడీపీఓ జానకి, సూపర్వైజర్ రాధికా అంగన్వాడి టీచర్ సరోజ , అంగన్వాడి వెల్పర్స్, విద్యార్థిని విద్యార్థులు బాలింతలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొని వంట నూనెలు, కందిపప్పు, ఫోర్టిఫైడ్ బియ్యం నిల్వ లలో జాగ్రత్తల పై నేడు బోధన్ లోని రెండు సెంటర్లు గోసం బస్తి గల్లీలో అంగన్వాడీ కార్యకర్తలను చైతన్య వంతులను చేశారు.

## ట్రిబుల్ ఐటీ లో దేశ వ్యవస్థాపక అభివృద్ధిపై చర్చ



**చట్టం, బాసర** : రాజీవ్ గాంధీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విశ్వవిద్యాలయం బాసరఆర్జీయూకేటీలో గురువారం మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో "భారతదేశంలో వ్యవస్థాపకత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు" అనే అంశంపై ప్రొఫెసర్ E. మురళీ దర్శన్, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓ ఎస్ డి) ద్వారా ఆలోచింపజేసే సెషన్ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సెషన్ విద్యార్థులను వ్యవస్థాపక వెంచర్లు, ఉపాధి మార్గాలను అన్వేషించడానికి ప్రేరేపించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించడం ఎంతో గర్వించదగ్గ విషయమని తెలిపారు. భారతదేశంలోని ప్రస్తుత వ్యవస్థాపక వ్యవస్థపై ప్రొఫెసర్ మురళీ దర్శన్ విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. ఉపాధి అవకాశాలు, సవాళ్లను హైలైట్ చేశారు. వ్యవస్థాపకత, ఆవిష్కరణల స్ఫూర్తిని తీసుకొని విద్యార్థులు తమ నూతన ఆలోచనలకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రణాళికలను వివరించారు. విశ్వవిద్యాలయం విద్యార్థులలో వ్యవస్థాపకత, నైపుణ్య అభివృద్ధిని ప్రోత్సహిస్తూనే ఉంది, వారి అభిరుచులు, ఆసక్తులను అన్వేషించడానికి వేదికలను అందిస్తోంది. ఈ ఇంటరాక్టివ్ సెషన్ విద్యార్థులు ప్రశ్నలు అడగడానికి చర్చలలో పాల్గొనడానికి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేటెడ్ డీన్ డాక్టర్ విట్టల్, హెచ్ ఓ డి డాక్టర్ నాగసాయి, స్వప్నిల్, స్వాతి, శ్రీవిద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



**చట్టం, నిర్మల్ ప్రతినిధి** : బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కేజీబీవీ లక్ష్మణచందా పాఠశాలలో జిల్లా విద్యాశాఖ సహకారంతో ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్ ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి బాలశక్తి నూతన ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, జిల్లాలోని 57 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాలశక్తి కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్యం, నైపుణ్యాల పెంపు, క్షేత్ర పర్యటనలు వంటి అంశాలపై విద్యార్థినులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాలశక్తి కార్యక్రమాన్ని మరింత పటిష్టం చేయడానికి, అదనంగా ధర్మసేవ ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారథ్యంలో ధ్యానం, యోగ, నైతిక విలువలతో కూడిన విద్య, ఆటలు, మార్షల్ ఆర్ట్స్ వంటివి జోడిస్తూ, విద్యార్థులను అన్ని అంశాల్లో పరిపుష్టం చేయడం జరుగుతుందని అన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రతీ విద్యార్థిని ఉద్యోగం సాధించాకనే, తమ పెళ్లి గురించి ఆలోచించాలని, ఆలోచిస్తామని విద్యార్థినులు అందరిచేత ప్రతిజ్ఞ తీసుకున్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు బోధించారు. లెక్కలను చేయించి జవాబులు రాబట్టారు. అంతకుముందు కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, ధర్మసేవ చారిటబుల్ ట్రస్ట్ ధీర ఫౌండేషన్ ప్రతినిధి నిశాంత్ రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపిడిఓ రాధా, విద్యాశాఖ అధికారులు పద్మ, యన్ ప్రవీణ్ కుమార్, వినోద్ కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి నవిత, ప్రత్యేక అధికారినులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ కంటి ఆసుపత్రి సేవలు ఆదర్శప్రాయం



**చట్టం, నవీపేట్** : బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి సేవలు ఆదర్శప్రాయామని ఫతేనగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నారు. గురువారం బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్య శిబిరం నిర్వహణ ఇంచార్జ్ హనుమంతరావు తెలిపారు.వారిలో 20 మందికి కంటి సమస్యలు నిర్ధారణ అయినట్లు వైద్యులు డాక్టర్ అజయ్ వెల్లడించారు.కంటి సమస్యలు తలెత్తకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు డాక్టర్ వివరించారు.కంటి సమస్యలు ఉన్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి బోధన్ లయన్స్ క్లబ్ ఆసుపత్రికి సిఫారసు చేశారు.బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సేవలు అభినందనీయమని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.లయన్స్ కంటి ఆసుపత్రి వారికి గ్రామ ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటామని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది,గ్రామ పెద్దలు,గ్రామస్తులు,పంచాతీ కరోబర్తదితరులుపాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అవగాహన




**చట్టం, నవీపేట్** : నవీపేట్ మండలంలోని గుండారం, నాగేపూర్, ఐలాపూర్ గ్రామాలలో వై ఆర్ జి క్యారీ సిఎల్ డబ్ల్యూ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో హెచ్ఐవి, టిబి, ఎస్ టి ఐ వ్యాధుల పట్ల గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామాలలో ప్రజలకు హెచ్ఐవి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ లింక్ వర్కర్ వడ్డే రవి మాట్లాడుతూ హెచ్ఐవి పై 100 గ్రామాలలో ఆర్గనైజేషన్ పనిచేయడం జరుగుతుందని అలాగే రిస్కు ఎక్కువగా ఎక్కడ ఉందో ఆ గ్రామాన్ని ఎంచుకొని రిస్కు తగ్గించడానికి పనిచేయడం జరుగుతుందన్నారు. ఐదు గ్రామాలలో విఐపి పోస్టల్ రూములు,గ్రామ పెద్దల సహకారాలతో కండోమ్స్ బాక్సులు సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో గ్రామ అభివృద్ధి కమిటీల సహాయ సహకారాలతో రిస్క్ లేని గ్రామాలుగా తీర్చుదిద్దుతామని అన్నారు. రానున్న వేసవి కాల దృష్ట్యా డిఆర్పి జిల్లా అధికారి సుధాకర్, సూపర్వైజర్ రజిత యాదవ్ గారి సహాయ సహకారాలతో మూడు గ్రామాలలో చలివేంద్రాలను సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం పట్ల గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. రిస్క్ లేని గ్రామాలుగా తీర్చిదిద్దడానికి వాలంటీర్స్, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఐకెపి సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దల సహాయ సహకారాలతో రిస్క్ లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. హెచ్ఐవి సోకిన రోగి పట్ల చిన్నచూపు చూడకుండా వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి, ఎమ్మెల్ హెచ్ పి సుప్రియ ఆశా వర్కర్లు అనురాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నీటి నాణ్యత పై అవగాహన సదస్సు



**చట్టం రెంజల్** : రెంజల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నీటి నాణ్యత పై అవగాహన కార్యక్రమాన్ని భూగర్భజాల శాఖ ఆధ్వర్యంలో నీటి కాలుష్యం కారణాలను నిర్వహించారు. గ్రామాలలో ఉన్న బోరుబావుల నీటిని సేకరించి మొబైల్ వ్యాన్లో ల్యాబ్ ద్వారా పరీక్షలు చేయించి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని భూగర్భజల ఉపసంచాలకులు పి శ్రీనివాసు బాబు, తెలిపారు. రెంజల్ గ్రామానికి చెందిన రైతులు బోరుబావుల నీటిని ల్యాబ్ ద్వారా పరీక్షలు చేయించారు. నీటిలో సై ట్రీస్ ఎక్కువ ఉండడం వలన దిగుబడి తగ్గే ఆస్కారం ఉంటుందన్నారు. సై ట్రీస్ ఎక్కువగా ఉన్న నీటి ద్వార సాగు చేసుకునే పంటల కోసం తగు సలహాలు, సూచనలు, ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీవో ఫి జస్ట్ నికత్ పర్వీన్, హైడ్రో జియాలజిస్ట్ హరీష్, ఉపాధ్యాయులు నాందేవ్, నరేష్, గంగాధర్, ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసిల్దార్



**చట్టం రెంజల్** : రెంజల్ మండల కేంద్రంలో గురువారం మీ సేవ కేంద్రాన్ని తాసిల్దార్ శ్రవణ్ కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. మీసేవ నిర్వాహకులు ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం చేపట్టిన కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేసి 50 రూపాయలు మాత్రమే రుసుము వసూలు చేయాలనితెలిపారు. విద్యార్థులకు సంబంధించిన కుల ధ్రువపత్రాలు, ఆదాయ ధ్రువపత్రాలు, ఇతర పత్రాలు, వ్యవసాయదారుల భూములను కొనుగోలు అమ్మకదారుల చాలను ఆన్లైన్లో నమోదు చేసి సకాలంలో తాసిల్దార్ కార్యాలయానికి చేరే విధంగా చూడాలని తెలిపారు. లబ్ధిదారుల దగ్గర అధిక రుసుము వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చిన తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్, మీసేవ నిర్వాహకులు భూమయ్య, మీసేవ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేసిన ఎంపీడీవో



**చట్టం రెంజల్** : రెంజల్ మండల కేంద్రంలో గురువారం నాలుగవ అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ తనిఖీ చేశారు. నేను ప్రకారం పిల్లలకు పౌష్టికారాన్ని అందించాలని ఆదేశించారు. వంటశాలను సందర్శించి వంట పాత్రాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వంట పాత్రలపై పైకప్పులు ఉంచాలని తెలిపారు. పిల్లలకు అందించే బియ్యాన్ని పరిశీలించి చెత్త చదరం లేకుండా, పిల్లలకు అందించే కోడిగుడ్లనుపరిశీలించి తగు జాగ్రత్తలను తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. అంగన్వాడి సెంటర్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ చూసి శుభ్రతను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్, అంగన్వాడి సిబ్బంది శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని గెలిపించండి



**చట్టం, భైంసా** : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్లను టీచర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటుగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన సి అంజి రెడ్డి ని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన మల్కా కొమురయ్య ని ఓటు వేసి గెలిపించవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో భైంసా పట్టణ అధ్యక్షుడు యనుపోతుల మల్లేష్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ గ్రాడ్యుయేట్ ఎన్నికల కన్వీనర్ బండారి దిలీప్, కౌన్సిలర్ గాలి రవి, టీచర్ ఎమ్మెల్సీ కన్వీనర్ గోపాల్ కిషన్, కో కన్వీనర్ ప్రవీణ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

▸ **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**చట్టం ,నిర్మల్ ప్రతినిధి :** ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని టీచర్స్, గ్రాడ్యుయేషన్ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, ఓటింగ్ మెషిన్లు, ఇతర అవసరమైన సామాగ్రి సమయానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు తగిన సూచనలు అందించాలని, వారికి పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ జరగాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, తాసిల్దారులు రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని స్థానాలలో సిపిఐ పార్టీ పోటీకి సిద్ధం

▸ **మతతత్వ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడుదాం...**

▸ **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్**




**చట్టం, రామకృష్ణాపూర్:** భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జనరల్ బాడీ సమావేశాన్ని మిట్టపల్లి పౌలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ హాజరై వారు మాట్లాడుతూ వందేళ్ల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ముందుకు సాగుతామని రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని స్థానాలలో సిపిఐ పోటీకి సిద్ధం అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 లో కాన్పూర్ లో ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఘనంగా శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తుందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్రానికై స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ పనిచేసిందని దున్నేవానికి భూమి ఉండాలని పేద ప్రజల అభ్యున్నతికై అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించిందన్నారు. "సబ్ కా సాత్ సబ్ కా వికాస్" అంటే పేద ప్రజల వికాసం కాకుండా కార్పొరేట్ కంపెనీల వికాసం మాత్రమే దేశంలో కొనసాగుతుందని విమర్శించారు. బడా వ్యాపార వర్గాల కోసం మాత్రమే బీజేపీ పని చేస్తుంది అనడంలో అతిశయోక్తి లేదన్నారు. అదానీ, అంబానీ లాంటి వారికి లక్షల కోట్ల బ్యాంకు రుణమాఫీలు చేసింది అంటే ఈ ప్రభుత్వం ప్రజల పక్షమా బడా వ్యాపారుల పక్షమా అర్థమవుతుందన్నారు. ఈ దేశంలో మతాల మధ్య కులాల మధ్య చిచ్చుపెట్టే మత తత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు కామెర దుర్గరాజ్, వనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తాం




**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో లోని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రచారం సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావు ఉర్దూ అకాడమి చైర్మన్ తహెర్బిన్ అంధన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముధోల్ నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో గెలిపిస్తాం ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి పోటీ భారతీయ జనతా పార్టీకి పోటీగా 3స్థానంలో ఉంది కావున ఎవరు కూడా ఇది ఎమ్మెల్సీ ఎన్నికలు అనుకోకుండా తమ రాబోయే పంచాయతీ ఎన్నికలు ఇవే అని కార్యకర్తలు పట్టభద్రుల ఎన్నికల వరకు ఓ సైనికుల పని చెయ్యాలి అని నారాయణ్ రావు పటేల్ మాట్లాడినారు ఈ కార్యక్రమం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంధ్రే ముత్యం రెడ్డి, బోజారం పటేల్ రాంచేంద్ర రెడ్డి బషీర్. నిర్మల్ జిల్లా యూత్ అధ్యక్షులు నుమాన్, ముధోల్ తాలూకా అధ్యక్షులు నూమన్ మండలాల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముమ్మర ప్రచారం



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ పట్టణంలో జరిగిన ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ జనరల్ సెక్రటరీ సునీల్ బన్సల్ జీ పాల్గొనగా అదేవిధంగా రాష్ట్ర సంఘటన్ మంత్రి చంద్రశేఖర్ జీ పాల్గొని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం దిశ నిర్దేశం పట్టణంతోపాటు పరిసర ప్రాంతంలో జిల్లాలో ఉన్న గ్రాడ్యుయేట్ పట్టభద్రుల జాబితాను తయారుచేసి వారికి ప్రత్యేక సమావేశం నిర్వహించి నూతన పట్టబద్రుల జాబితా పై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గోడెం నాగేష్ ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ , నిర్మల్ శాసన సభ్యులు , బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్య , జిల్లా అధ్యక్షులు, ఇంఛార్జిలు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## నిత్యవసర సరకులు పంపిణీ



**చట్టం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :**గామ ఫౌండేషన్ సిఈఓ దుర్గా ప్రసాద్ ఆదేశాల మేరకు చొప్పదండి నియోజకవర్గం ప్రాజెక్ట్ డెరైక్టర్ జోగు పాల్ ఆధ్వర్యం లో పెద్దపల్లి జిల్లాలో సెంటనరీ కాలనిలో గామా ఫౌండేషన్ లో సభ్యత్వం తీసుకున్న 10 కుటుంబాలకి ఆహార భద్రతలో భాగంగా మొదటి విడత నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేష్, కరీంనగర్ జిల్లా ప్రధానకార్యర్శి సీపల్లి శ్రావణ్ కుమార్ , శ్రీనివాస్, మోటివేషన్ స్పీకర్ అబ్దుల్ రహీమ్, పెద్దపల్లి అబ్దుల్ ముషాహిద్, డాక్టర్ శ్రీనివాస్, జంగటీ సాగర్, అబ్రర్ అలి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తవక్కల్ పాఠశాలలో మెగా రక్తదాన శిబిరం...

▸ **రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి...**



**చట్టం, రామకృష్ణాపూర్:** పట్టణానికి చెందిన తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్, మంచిర్యాల జిల్లా ట్రస్మా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ 57వ జన్మదిన సందర్భంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తవక్కల్ పాఠశాలలో మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని అబ్దుల్ అజీజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అయనతో కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రత్యేకంగా అలరించాయి. ఈ శిబిరంలో సుమారు 70 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రఘునాథరెడ్డి, మాజీ ఎంపీపీ మహంకాళి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాకు శుభాకాంక్షలు

▸ **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్**



**చట్టం న్యూస్ కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తాను ప్రకటించిన కేంద్ర బీజేపీ సర్కార్ రేఖా గుప్తాకు సురభి నవీన్ కుమార్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ గా ఉన్న సురభి నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఏబీవీపీ మహిళా కార్యకర్తగా ప్రస్థానం మొదలుపెట్టి బీజేపీ తరపున తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ముఖ్యమంత్రి పిఠాన్ని అధిరోహించడం మోడీ సర్కార్ స్త్రీలకు ఇస్తున్న గౌరవాన్ని పెద్దపెల్లి నియోజకవర్గ ఎమ్మెల్సీ మహిళా విద్యాధికులతో సంతోషాన్ని పంచుకున్నారు. మహిళలు స్వేచ్ఛ స్వతంత్రాలతో జీవితంలో ఎదగడానికి బీజేపీతోనే సాధ్యమని సురభి నవీన్ కుమార్ తెలిపారు.

## రెంజల్ పీహెచ్ సి... తాహసిల్దార్ ఆకస్మిక తనిఖీ



**చట్టం రెంజల్ :** రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల తహసిల్దార్ శ్రవణ్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాము కాటు,కుక్క కాటు నివారణ మందులు అందుబాటులో ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.అయిపోయిన వెంటనే మందులను సమకూర్చుకోవాలని తాహసిల్దార్ ఆదేశించారు. డెలివరీలు స్థానికంగా ఎన్ని అవుతున్నాయని డాక్టర్లకు అడిగి తెలుసుకున్నారు.సాధారణ డెలివరీ అయితే ఇక్కడ చేస్తున్నామని ఆపరేషన్ కొరకు జిల్లా జనరల్ ఆసుపత్రికి సిఫారసు చేస్తున్నామని సిబ్బంది తాహసిల్దార్ కు చెప్పారు.సాధ్యమైనంత వరకు సాధారణ డెలవరిలను ఎక్కువ సంఖ్యలో చేయాలని సూచించారు.డెలివరీలు పి హెచ్ సి సెంటర్ లోనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.డాక్టర్లు మరియు సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలని ఆదేశించారు.లేనియెడల చర్యలు ఉంటాయని హెచ్చరించారు.నిర్లక్ష్యం వహించకుండా గ్రామస్తులకు సేవలను అందించాలని తెలిపారు.అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులను ఎప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు.డ్యూటీ డాక్టర్ వినయ్ నిత్యం విధులకు హాజరు అవుతున్నారా లేదా అన్న విషయంపై తహసిల్దార్ ఆరా తీశారు.విధులకు హాజరు కాకుండా కుంటి సాకులు చెప్పినట్లు ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత జిల్లా అధికారికి సమాచారం అందించి చర్యలు తీసుకుంటామని అన్నారు.నిత్యం విధులు నిర్వహించాల్సిన వైద్యుడు ఇతర పనులు మరియు సమావేశాలు ఉన్నాయంటూ విధులకు హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వైద్యులు నిత్యం వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుచున్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్,డాక్టర్ ఉజ్మ,డాక్టర్ ప్రమోదుత,ఆరోగ్య విస్తీర్ణ అధికారి రవీందర్,ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అంగరంగ వైభవంగా పసుమాముల శ్రీ సీతాసమేత శ్రీరామచంద్రుల వారి ఆలయ 14వ వార్షికోత్సవం



**చట్టం, అబ్దుల్లాపూర్మెట్:** పెద్ద అంబర్పేట్ మున్సిపల్ పరిధి పసుమాములలోని శ్రీ రామగిరి గుట్టపై నిర్మించినటువంటి శ్రీ సీతాసమేత శ్రీరామచంద్రుల వారి ఆలయ 14వ వార్షికోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపెల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవాలలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు మరియు సత్యనారాయణ స్వామి వారి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు నిష్టతో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా పెద్ద అంబర్పేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి పాడిపంటలు చక్కగా పండాలని, రైతు సోదరులు సంతోషంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్, మాజీ కౌన్సిలర్లు, పలు పార్టీల నాయకులు, ఆలయ కమిటీ చైర్మన్ భక్కి యాదయ్య గౌడ్, డైరెక్టర్లు పర్వత శ్రీనివాస్ రెడ్డి, బండ్లగూడ వెంకటేష్ గౌడ్, తులసి గారి బాలయ్య, సంగి బిక్షపతి, మాజీ కోఆప్షన్ సభ్యులు చర్లపల్లి శంకరయ్య గౌడ్, కేసీ నరేందర్, ఎరుకల రాజేశ్వర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ పాడే జంగయ్య, కొత్తపల్లి మైపాల్ రెడ్డి, చర్లపల్లి బాబు గౌడ్, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు



**చట్టం, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** _ రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి ఏర్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి ఎంపీఓ, ఎం.పి.డి.ఓ లు మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అందుకుగాను సమస్యాత్మక ప్రాంతాల్లో పైప్ లైన్లు మరమ్మత్తులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలన్నారు. వేసవి కాలంలో నీటి సరఫరాలో సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయో గుర్తించి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లీకేజీ మరమ్మతులు ఏమైనా ఉంటే వాటిపై దృష్టి పెట్టి ఎక్కడ కూడా త్రాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు సమన్వయంతో పనిచేసి రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా నీటి పంపులు, మోటర్లు, వాల్స్ లు పైపులకు సంబంధించి మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో ఆయా గ్రామాలను నీటి సరఫరా అధికారులు సందర్శించి అందుకు కావలసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ పురుషోత్తం, డి.పి.ఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈ.ఈ కృష్ణారెడ్డి, ఎం.పి.ఓ, ఎం.పి.డి.ఓ లు, వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

## విద్యార్థులకు ఈఆర్ ఫౌండేషన్ వితరణ



**చట్టం ఆర్మూర్:**నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం రోజు ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆర్గుల్ సురేష్, రాంప్రసాద్, కొండి రామచందర్, గోపి కృష్ణ, సైఫ్, మూజాహిద్, విక్రాంత్, సుబ్బు, ఆలూరు కింగ్స్ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు

▸ **ఇసుక అక్రమ రవాణా సమర్థవంతంగా అరికట్టాలి**

▸ **రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్**



**చట్టం, రామగుండం కమిషనరేట్ :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అక్రమ ఇసుక రవాణా ను నియత్రించేందుకు సమర్థవంతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. ఇందులో భాగంగానే పోలీస్ కమిషనర్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ మంథని ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధి లోనీ ఖమ్మం పల్లి, జిల్లాల పల్లి లోని ఇసుక తరలించే ఇసుక క్వారీ లను ఆకస్మికంగా సందర్శించారు. క్వారీ సందర్శించి ప్రధానంగా రవాణా దారులు ఇసుకను అక్రమంగా తరలించే మార్గాలపై పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికరులను ను అడిగి తెలుసుకున్నారు. వాహనాల వే బిల్స్,లోడ్ పరిమితి నీ పరిశీలించడం జరిగింది. ముఖ్యంగా అక్రమంగా ఇసుక తరలించే వారి సమాచారాన్ని అందుబాటులో వుంచుకోవడంతో పాటు వారి కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సీపీ అధికారులకు సూచించారు. తనిఖీలు జరిపే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా తనిఖీ చేసిన వాహన వివరాలను నమోదు చేసుకోవాలని, ఇసుక తరలించే వాహనాలకు అనుమతి పత్రాలు ఉన్నాయో కూడా తప్పనిసరిగా పరిశీలించాలని, నిరంతరం ఇసుక రవాణా వాహనాలపై నిఘా పెట్టాలని పోలీస్ కమిషనర్ సూచించారు.ఈ సందర్భంగా అక్కడ విధులలో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే అట్టి వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ప్రస్తుతం ప్రభుత్వ అనుమతి తో నడుస్తున్న ర్యాంపుల నుండి ఇసుక తరలించే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి డా. చేతన , స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర, గోదావరిఖని ఎసిపి రమేష్, మంతిని సిఐ రాజు, ముత్తారం ఎస్ ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఆక్షన్ ప్రీమియర్ లీగ్ 1




**చట్టం ఆర్మూర్** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో గల జావేద్ భాయ్ మినీ స్టేడియంలో గత పది రోజుల నుండి బిగడమీది సుమన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఆక్షన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. గురువారం రోజు గ్రాండ్ ఫినాలే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆశ హాస్పిటల్ అధినేత డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్వీ న్యూరో హాస్పిటల్ అధినేత డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ సంకేత్, వి ఆర్ హాస్పిటల్ డాక్టర్ ముత్యంరెడ్డి, హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గత పది రోజుల నుండి నడుస్తున్న ఈ క్రికెట్ పోటీలకు 8 జట్లు ఫ్రాంచైజులుగా పాల్గొన్నవి. మొత్తం ఒక్కో జట్టుకు మూడు మ్యాచ్లను నిర్వహించగా. రెండు జట్లు అమాన్ ఎలెవన్ సైదాబాద్ జట్టు, ఇండియన్ స్పోర్ట్స్ ఆర్మూర్ జట్టు ఫైనల్ మ్యాచ్లో తలపడగా అమాన్ ఎలెవన్ విజేతకాగా వారికి కాఫీ తో పాటు 30 వేల రూపాయలు నగదు రూపేన అందజేశారు. రన్నరప్ గా ఇండియన్ స్పోర్ట్స్ ఆర్మూర్ జట్టు నిలిచింది ట్రోఫీతో పాటు 20 వేల రూపాయల నగదు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా మ్యాన్ ఆఫ్ సిరీస్ గా షన్నాకు వెయ్యి రూపాయల నగదు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమాన్నీ బొగడ మీద సుమన్ అండ్ ఫ్రెండ్స్, క్రికెట్ అభిమానులు విజయవంతం చేశారు. ఈ క్రీడా పోటీలను దాదాపు ఆర్మూర్ నియోజకవర్గ మండలాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తిలకించారు.

## చాయ్ వాలా ప్రధాని అయినపుడు ట్యూషన్ టీచర్ ఎమ్మెల్సీ కాకూడదా



**చట్టం : శంకరపట్నం :** ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జిల్లాల ఎమ్మెల్సీగా ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వెలుగు నీడ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మోరే గణేష్,దళిత బంధు ఆత్మ గౌరవ సంక్షేమ సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరపెల్లి శివప్రసాద్, లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్పొరేట్ విద్యతో రాష్ట్ర పేరెంట్స్ ను ఆర్థికంగా దోచుకుంటున్న క్రమంలో పేద మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉంటూ ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల నెలకొల్పి వేలాదిమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది, దేశంలోని ముఖ్యమైన వైద్య విద్యలో ఐఐటి కళాశాలలో ప్రముఖ ఉద్యోగ సంస్థల్లో అగ్రశ్రేణిలో నిలబెట్టడానికి తన వంతు కృషిచేసి విద్యార్థుల భవిష్యత్తు తన భవిష్యత్తుగా భావించి శ్రమించిన నరేందర్ అన్న ఎమ్మెల్సీగా గెలిస్తే పట్టబద్దుల హక్కుల కోసం ప్రభుత్వంతో పోరాడి హక్కులు సాధిస్తారని గణేష్ వివరించారు. కరీంనగర్ జిల్లా తో పాటు చుట్టుపక్కల ఉన్న విద్యార్థులంతా నరేందర్ సార్ ట్యూషన్ చెప్తేనే తాము విద్యలో రాణిస్తామని భావనతో వందలాదిగా, ట్యూషన్ లో చేరిన విద్యార్థుల భవిష్యత్తు కోసం తను పీహెచ్డీ లాంటి ఉన్నత విద్యను త్యాగం చేసి తన విద్యార్థుల భవిష్యత్తు ను ఉన్నతంగా తీర్చిదిద్దిన త్యాగశీలి నరేందర్ అన్నని కొనియాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన మొదలైన గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆల్ ఫోర్స్ నరేందర్ అన్నను గెలిపించి మరింత ముందుకు తీసుకుపోవాలని కోరుతూ, గురువారం శంకరపట్నం మండల కేంద్రంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు.

## చిల్డ్రన్ పార్క్ ప్రారంభించిన ఐజి చంద్రశేఖర్ రెడ్డి...



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి)** దేవునిపల్లి పిఎస్ నందు కామారెడ్డి ఎస్పి సింధు శర్మ ప్రత్యేక కృషితో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్ ను గురువారం మల్టీ జోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు .ఎస్పీ సింధు శర్మ ,ఏ ఎస్పీ చైతన్య రెడ్డి రూరల్ సీఐ రామన్ ,ఎస్సై రాజు పోలీస్ సిబ్బంది పిల్లలు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లుల మంజూరీలో అవినీతిని అరికట్టాలి

- టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల సాంబయ్య
- డిఏలు, పిఆర్సి అమలు చేయాలి.



**చట్టం, రామగుండం కమిషనరేట్ :** జిల్లాలో మాద కద్రవ్యాలను నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి.వేణు సమీక్షిత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధి కారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమా వేశాన్ని నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్ర వ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్ర మాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మా ట్లాడుతూ.... విద్యా సంస్థలలో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మానిపించాలని అన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశా లలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే వచ్చే పరిణా మాలు, మాదకద్రవ్యాల బానిసత్వం నివారణకు ప్రభు త్వం ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరం గా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ అధికారుల ను ఆదేశించారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధి కారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరి గిందని, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించా లని అదనపు కలెక్టర్ సూచించారు. అటవీ శాఖ అధి కారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారుల కు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రోడ్డు భద్రత ప్రమాణాల పై అవగాహన కల్పన, బర్డ్ ఫ్లూ బ్రదర్ అంశాలపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించే పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి జి. క్రిష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జిల్లా అటవీ అధికారి శివయ్య, జిల్లా ఆప్కారి శాఖ అధికారి మహిపాల్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ MLC ఎన్నికల్లో అభ్యర్థి పులి సర్వోత్తమ రెడ్డి గెలుపు కోసం బీ జె పి నాయకుల ప్రచారం



**చట్టం గంగారం :** ఈ నెల 27 తారీఖు జరగనున్న ఉమ్మడి నల్గొండ వరంగల్ ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపద్యం లో జరుగుతున్న ప్రచా రంలో భాగంగా గంగారం మండల పరిది లో ఉన్న ఉపాధ్యాయ MLC ఓటర్లను గంగారం మండల బిజెపి నాయకులు వెళ్లి నేరుగా కలిసి బిజెపి బలప రిచిన అభ్యర్థి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలి పించగలరని అభ్యర్థించడం జరిగింది పిల్లల భవిష్యత్ కు ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో తెలియని వారుండరు, అలాంటి మెదవి వర్గం సమస్యలు ఏదైనా ఉంటే కచ్చితంగా న్యాయం చేయగలిగే సామర్థ్యం ఉన్న వ్యక్తి పులి.సర్వోత్తమ రెడ్డి, వారిని శాసన మండలికి పంపిస్తే శాశ్వత పరిష్కారం కోసం పనిచేసే అవకాశం ఉందని, అందుకు బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని గంగారం మండల బిజెపి అధ్యక్షులు సువర్ణ పాక నరేందర్, సువర్ణపాక సురేష్, మనోహర్, వికాస్ , సమ్మన్న మాజీ అధ్యక్షులు జనగం వెంకన్న , జిల్లా కౌన్సిల్ మెంబర్ బానోత్ శివరామ్ నాయక్, సీనియర్ నాయకుడు పూజారి.రవి, జిల్లా యువ నాయకులు ఈక నరేష్, దిలీప్, సంతోష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి...



**(చట్టం న్యూస్ ప్రతినిధి అసిఫ్ కామారెడ్డి)** పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం కావాలని కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ సూచించారు. బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాల న్నారు. ఎల్లారెడ్డి లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పా ఠశాలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు గణితం సైన్స్ సబ్జెక్టులలో పలు ప్రశ్నలకు జవాబులు అడిగి తెలుసుకున్నారు విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయు లను ఆదేశించారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు .కలెక్టర్ వెంట ఆర్డిఓ ప్రభాకర్ ఎంఈఓ వెంకటేశం మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన తల్లీకూతురు..

- గురువారం తిరిగి ఇంటికి వచ్చిన వైనం..



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి )**కామారెడ్డి జిల్లా దోమ కొండలో తల్లి కూతుళ్లు అదృశ్యమైన సంఘ టన దోమకొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.స్రవంతి తెలిపిన వివరాల ప్రకారాం.. దోమ కొండకు చెంది న నర్రాగుల కళావతి(40), నర్రా గుల భవాని (14)సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని తెలిపారు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభిం చకపోవడం తో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ విషయమై గురువారం ఎస్సై స్రవంతిని చట్టం వివరణ కోరగా తల్లి కూతురు ఇంటికి తిరిగి వచ్చారని చెప్పారు. కుటుంబ తగాదాలే కారణమని సమాచారం. ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి

## మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్



**చట్టం, భైంసా :**భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుంటల మండలం నాయకులు ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు భోస్లే నారాయణ్ రావు పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిసి కలిశారు. ఎమ్మెల్సీ ప్రచారంలో కుంటాల మండలం నుండి భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భోజారాం పటేల్,కుంటల మండలం యూత్ అధ్యక్షులు మహేష్ ,మహేందర్ ,సంతోష్,నవీన్ ,రాంజీ, రావి, తదితరులు పాల్గొన్నారు.


## రైతుల నిరసన యాత్ర



**చట్టం ఆర్మూర్:**వ్యవసాయ మార్కెట్ విధానాల ముసాయిదా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని రైతుల నిరసన యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ కోరారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రం లోని మామిడిపల్లిలో రైతులతో కలిసి వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో రద్దయిన చట్టాలు మార్కెట్ రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉంది అన్నారు. ఈ ముసాయిదా విధానం రైతుల కోసం కాకుండా కార్పొరేట్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ముసాయిదాని వెనక్కి తీసుకోవాలని రేపు ఆర్మూర్ మార్కెట్ యార్డ్ నందు జీపు యాత్ర 10 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. జీపు జాత ఆలూరు నుండి నందిపేట్, నవీపేట్, జానకంపేట నుంచి గంజి లో ముగింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.భూమన్న, రైతులు పెద్ద రాయుడు, కారం చిన్న రాజన్న, పూత సాయన్న, తనకంటే నడిపి గంగారాం, నరేష్, దేవల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఎదురుగా శివాజీ ప్లెక్సీ

- ఎస్సి, బిస్సి కులాల మధ్య గొడవ.
- పోలిసుల పీకేటింగ్ తో ప్రశాంతత.



**చట్టం భీంగల్** నిజామాబాదు జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలం బడా భీంగల్ గ్రామంలోని డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా మున్నూరుకాపు కులానికి చెందిన (కుమ్మరి, మల్లెల )రెండు సంఘాల సభ్యులు శివాజీ ప్లెక్సీ పెట్టడం తో గురువారం రోజు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. డా బి ఆర్ అంబే ద్కర్ విగ్రహానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీ తొలగించాలని మాల, మాదిగ కులస్తులు బడా భీంగల్ గ్రామభివృ ద్ధి కమిటీ కి విన్నవించుకున్నారు. విడిసి చెప్పినగా ని వినలేరు. మాల మాదిగ కులాల కుటుంబాల సభ్యులు పోలీసులకు, గ్రామ పంచాయతీ కార్యద ర్శి కి సమాచారమందించారు. పోలీసులు రాగానే ఫ్లెక్సీ తొలగించి, అక్కడే డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నీటి కుండీ నిర్మించాలని పట్టు బట్టి నిర్మాణాన్ని ప్రారంభించారు. పోలీసులు నివారించిన పోలీసులను తోసివేస్తూ నిర్మాణం చేయడంతో పోలీసులకు, కాపు కులస్తులకు మధ్య పెద్ద తోపులాట జరిగింది. మాల మాదిగ కులాల సభ్యులు అక్కడే ఉన్నా కూడా, గొడవ జరుగవద్దని శాంతియుతంగా కూర్చున్నారు. పోలీసులు పోలీస్ బలాగాన్ని దింపి, నిర్మాణన్ని ఆపేసి అక్కడే పీకేటింగ్ వేశారు. బడా భీంగల్ లో డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారిపై భీంగల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. డా బి ఆర్ అంబేద్కర్ ను అవమాన పరిచేలా చేస్తున్నావారిపై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలనీ మాల మాదిగ 500 కుటుంబాల సభ్యులు మాకు న్యాయం చేసి దోషులను చట్టపరంగా శిక్షించాలని కోరారు. డా బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు జరుగుతున్న వివాదం తెలుసుకొని మండల దళిత నాయకులు గడాలా ప్రసాద్, మేకల శ్రీనివాస్, భీమా రవీందర్, బట్టు అనిల్, గట్టు రతన్ లు మద్దతుగా నిలిచారు. బాల్కొండ నియోజకవర్గం డా బి ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఇంచార్జ్ జిన్న జనార్ధన్ బడా భీంగల్ దళితులకు మద్దతు తెలిపి, ఎస్సీలపైకి కా పువారిని రెచ్చ గోడుతున్న వారిపై కేసు నమోదు చేయాలనీ భీంగల్ సీఐ పి సత్యనారాయణ, ఎస్సై జి మహేష్ లను కోరారు.


## టీకేఎస్ మెగా స్పోర్ట్స్ 20242025

- క్రీడాస్ఫూర్తి మరియు సమాజ స్ఫూర్తికి గొప్ప వేడుక




**చట్టం, హైదరాబాద్:** 2024 2025 టీకేఎస ్ కమిటీ విజయవంతంగా ,టి కే ఎస ్ మెగా స్పోర్ట్స్ అనే ఆసక్తికరమైన ఈవెంట్‌ను డిసెంబర్ 20, 2024, నుండి ఫిబ్రవరి 14, 2025 వరకు ఎనిమిది వారాల పాటు నిర్వహిం చింది. అనేక క్రీడా పోటీలు, పాల్గొనేవారి అద్భుత ప్రతిభను ప్రదర్శించేందుకు తగిన వేదికను అందించాయి, ఇది క్రీడాస్ఫూర్తిని, జట్టు పని మరియు సామాజిక ఆత్మను ప్రోత్సహించింది .ఈ ఈవెంట్‌లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, మహిళల కోసం బాక్స్ క్రికెట్, చెస్ వంటి క్రీడలు నిర్వహించబడ్డాయి. చిన్నారుల కోసం చెస్ మరియు బ్యాడ్మింటన్ పోటీలు కూడా ప్రవేశపె ట్టారు, తద్వారా చిన్న వయస్సులోనే ప్రతిభను ప్రోత్సహించడానికి అవకాశం కల్పించబడింది. రెండు నెలలపాటు ఉత్సాహభరితమైన పోటీలు జరిగి, ఆటగాళ్లు అసాధారణమైన క్రీడా నైపుణ్యా న్ని ప్రదర్శించారు.ఫిబ్రవరి 14, 2025న బౌల్డర్ సల్మియా వద్ద జరిగిన అంతిమ కార్యక్రమానికి ప్రముఖ భారత క్రికెటర్ మరియు బీసీసీఐ మాజీ సెలెక్టర్ ఎమ్మెస్ కే ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. .ఎనిమిది వారాల పాటు ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు టీకేఎస ్ కమిటీ సభ్యులు మరియు స్వచ్ఛంద సేవకులు అద్భుతంగా శ్రమించారు. క్రీడలే కాకుండా, కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి అద్భుతమైన క్షణాలను పంచుకునే ఒక సామూహిక వేడుకగా ఇది రూపుదాల్చింది. టీకేఎస ్ మెగా స్పోర్ట్స్ 20242025అత్యుత్తమ క్రీడా ఉత్సవంగా నిలిచి, ప్రతి వయస్సు వారికి క్రీడాపట్ల ప్రేమను పెంపొం దించింది. సమిష్టి కృషి, క్రీడా పోటీలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలతో ఇది అపూర్వమైన గుర్తింపు సాధించింది. భవిష్యత్తులో ఇంకా పెద్ద స్థాయిలో ఈవెంట్లను నిర్వహించేందుకు ఈ కార్యక్రమం దారితీసింది.ఈ కార్యక్రమం విజయవంతం కావ డానికి సహకరించిన అన్ని పాల్గొనేవారికి, ప్రేక్షకు లకు, స్వచ్ఛంద సేవకులకు మరియు స్పాన్సర్లకు ,టీకేఎస ్ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తుంది.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



**చట్టం ఆర్మూర్:** బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థు లను గెలించాలని ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్, హైద్రాబాద్ చైతన్యపురి కార్పొ రేటర్ రంగా నర్సింహా గుప్తా, గురువారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పట్టభద్రుల ఇంటికి వెళ్లి కలసి బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్య ర్థులు అంజి రెడ్డి, మల్కకొమరయ్యలను గెలిపించా లని కోరారు.బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రములో మరింత అభివృద్ధికి సాధ్యం అవుతుందన్నారు. మోడీజీ నాయకత్వంలో భారత దేశం అగ్రగామిగా వెలుగొందుతుందని, నీతి వంతమైన పాలన కొనసాగుతుందని అన్నారు. ఈరోజు పెర్కిట్, కమలనెహ్రూ కలోని, ఆలూరు రోడ్ లలో పర్యటించి పట్టభద్రుల ఇంటింటికి తిరిగి అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాలేపు రాజు, కలిగోట గంగాధర్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, నవీన్ యాదవ్, రుద్రరపు శంకర్, నరేందర్ రెడ్డి మాజీ కౌన్సిలర్ సాయి, తదితరులు పాల్గొన్నారు

## రామకోటి సేవలు అభినందనీయం వంగపల్లి అంజయ్య స్వామి



**చట్టం, సిద్దిపేట, (దుబ్బాక) :** రామకోటి రామరాజు సేవలు అభినందనీయం అని వం గపల్లి అంజయ్య స్వామి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం రేణుక ఎల్లమ్మ దేవాలయం వ్యవ స్థాపక అధ్యక్షుడు వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో రామకోటి రామరాజు ఘన సన్మానం చేశారు. అనంతరం వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కాచారంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అనగా 23022025 రోజున నిర్వహించే వార్షికో త్సవ వేడుకలకు రావాల్సిందిగా రామకోటి రామరాజుకు ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందన్నారు. అనంతరం రామకోటి రామరాజు మాట్లాడుతూ వంగపల్లి అంజయ్య స్వామి ప్రజలను భక్తి మార్గం వైపు పయనించే విధంగా కృషి చేస్తూ ప్రతి మంగళవారం రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభిందనేయం అని, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు.

## దారుణ మోసాలను అరికట్టే బాధ్యత ముమ్మాటికీ మన పోలీస్, న్యాయ వ్యవస్థదే!



**చట్టం :** న్యాయం జరిగే విషయంలో న్యాయస్థానాల దగ్గర జరిగే ఎడతెగని,తీవ్ర జాప్యాన్ని అరికట్టాలి! ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసిన ఉమ్మడి కుటుంబాల ఆస్తుల విషయంలో అన్నదమ్ముల మధ్య వచ్చే పొరప చ్చలు, ఘర్షణ వాతావరణం,బహిరంగ పొట్లాటలు, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, పరస్పర దాడులు చేసుకుంటూ తమది న్యాయం అంటే తమది న్యాయం అంటూ చివరకు పోలీస్ స్టేషన్ కు ,కోర్టుకు వెళ్లడం వంటివి సంభవించడం ఒక సర్వ సాధారణ విషయంగా మారిపోవడం ఈ సమాజానికి సంబందించి ఏ మాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదు.ముఖ్యంగా ఈ ఉమ్మడి ఆస్తుల విషయంలో ఎవరికి చెందాల్సిన ఆస్తులు వారికే చెందకుండా అంతా ఆస్తిని తాము ఒక్కరమే అనుభవించాలనే దురాశ తో,దుర్బుద్ధితో తమకు వచ్చే ఆస్తులు చాలక తన సొంత అన్నదమ్ముల, తోబుట్టువుల ఆస్తులను కూడా దొడ్డి దారిలో కాజేయాలని చూస్తుండటం, హస్తగతం చేసుకోవాలని ప్రయత్నం చేయడం అందుకోసం ఎలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడటానికి కూడా వెనుకంజ వేయకపోవడం వంటి అనైతిక పోకడల మూలాన ఆస్తుల వ్యవహారాలు ముదిరి పాకాన పడి ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ,దుమ్మెత్తి పోసుకుంటూ అంతిమంగా న్యాయం కోసం ఏ పోలీస్ స్టేషన్ లేదా న్యాయ వ్యవస్థ గడపనో తొక్కడం వంటి చర్యలు అనేకం ప్రస్తుతం మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తున్నాయి అనే మాట పచ్చి యధార్థం.అయితే ఎక్కువ భాగం ఇలాంటి కేసులలో తమ తల్లిదండ్రులను నయనో భయానో లొంగదీసుకొని లేదా వారిని పక్క ద్రోవ పట్టించి మరీ ఉమ్మడి కుటుంబంలోని కొంతమంది నయవంచకుల వంటి అన్నదమ్ములు తమ సొంత అన్న లేదా తమ్ముడి ఆస్తులను చట్టంలోని లొసుగులను ఆదారంగా చేసుకొని ఆస్తులను అప్పనంగా కొట్టేసేం దుకు ఎన్నో కుట్రలు,కుతంత్రాలు పన్నుతుండటం, అందుకోసం నీతి,నియమాలకు సైతం తిలోదకాలు ఇచ్చి,నానాగడ్డి తినే డబ్బు వ్యామోహం మెండుగా గల కొంతమంది లాయర్లను ఆసరాగా పెట్టుకొని మరీ అందరికి చెందాల్సిన ఆస్తులు తమకే చెందేలా ఆస్తులను తమ పేరిట దొంగ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కూడా ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు అంటే నేటి సమాజంలో ఎలాంటి అత్యంత దురదృష్టకర మైన,ఆందోళనకరమైన పరిస్థితులు పొడచూపుతున్నాయో మనకు బాగా విశదమవుతున్నది, తేటతెల్ల మవుతున్నది అనే మాట అక్షర సత్యం.అందుకోసం మోసపురితమైన,దగాకోరు పంథాలో తల్లిదండ్రుల నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల పై సంతకాలు తీసుకోని తమకు చెందని ఆస్తులను కూడా కొంతమంది రిజిస్ట్రేషన్ ఆఫీసు అధికారులను,అక్కడ పనిచేసే సిబ్బందిని మభ్యపెట్టి వారికి కాసుల ఆశ చూపి తమ పేర లిఖించుకొని అన్ లైన్ చేసుకుంటున్నారు అంటే మన వ్యవస్థ ఎంతగా భ్రష్టు పట్టిందో,ఏ స్థాయిలో దిగజారిపోయిందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏదిఏమైన ఇప్పటికయినా ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు తమ ఆస్తుల విషయంలో నిద్రాణావస్థ నుంచి మేల్కొని తమ ఆస్తులు మరొకరి పాలు కాకుండా, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు,ఒకవేళ తమకు అన్యాయం జరిగిన త్వరితగతిన తమ తల్లిదండ్రులను సంప్రదించి జరిగిన దారుణ మోసాన్ని వారికి బట్టబయలు చేసి వారిని (ఎంఆర్ఓ) మండల రెవెన్యూ అధికారి,తహశీల్దారు వంటి ఆఫీసర్ల వద్దకు తీసుకెళ్లి తక్షణమే వారు దొడ్డి దారిన రిజిస్ట్రేషన్ చేసిన భూమిని బ్లాక్ చేయించే విషయంపై అవగాహన పెంచుకొని తమ విలువైన ఆస్తులను అత్యంత సురక్షితం గా కాపాడుకోవాలి.ఏమైనా నేటి సమాజంలో ఓకే కుటుంబంలోని అన్నదమ్ములలో ఎవరు మంచి బుద్ధి కలవారో,ఎవరు చెడు బుద్ధి కలవారో తెలుసుకోవడం చాలా దుర్లభంగా,సంక్లిష్టంగా మారిన ఈ దయనీయ పరిస్థితుల్లో నిరంతరం అప్రమత్తత అనే ఆయుధాన్ని మనమంతా కలిగి ఉండటం సర్వదా శ్రేయస్కరం. ఇందులో ఎలాంటి సందేహానికి తావు లేదు. కాబట్టి ఉమ్మడి ఆస్తుల పరిరక్షణే ప్రదాన ధ్యేయంగా ప్రతి ఒక్క ఉమ్మడి కుటుంబ సభ్యులు భావించి తదనుగుణంగా తమ గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించక పోతే మాత్రం 'చేతులు కాలిన ఆకులు పట్టుకున్న చందాన' మీ అమూల్యమైన జీవితాలు అదోగతి పాలు కావడం తథ్యం.అలా ఎట్టి పరిస్థితుల్లో జరుగకుండా ముందే జ్ఞానోదయం పొందితే మీ విలువైన ఆస్తులు మీ సురక్షితమైన హస్తాలలోనే నిర్లిప్తమై వుంటాయి

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా!**

## శివాజీ వేశధారణ చిన్నారులను సన్మానించిన రామకోటి



**చట్టం, సిద్దిపేట (దుబ్బాక) :** శివాజీ జయంతి సందర్బంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ హైదవ సోదరుల ఆధ్వర్యంలో కాషాయ జెండాలతో జై శివాజీ జై భవాని నినాదాలతో భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో శివాజీ వేశధారణలో కొందరు చిన్నా రులు వారి ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. వీరి ప్రతిభకు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ వీరుడు ,శూరుడు హిందువుల పాలిట దేవుడు అని అన్నారు. తిగుల్ గ్రామంలోని గాయత్రీ విద్యాలయంకు చెందిన శ్రీవర్ధన్ రెడ్డి, హర్షిత, వైష్ణవి, చరణ్, మనీష, కీర్తన, అన్విత, పృథ్వీరాజ్ విద్యార్థులు శివాజీ వేషంలో అద్భుతంగా రానించారన్నారు. అందుకే రామకోటి సంస్థ ద్వారా వారిని సన్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, నాయిని సందీప్, గంగిశెట్టి రవేందర్, కాశబోయిన సందీప్, గోలి సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

## అనుమతులు లేని డెయిరీ ప్లాంట్ మూసివేత




**చట్టం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :**వేము లవాడ మండలం అగ్రహారంలోని కరీం నగర్ మిల్క్ ప్రొడ్యూసర్ డెయిరీ ప్లాంట్ కు సరైన అనుమతులు లేకపోవడంతో, ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా తాత్కాలికంగా మూసివేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల శాఖ నుండి ఇన్స్పె క్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వారి అనుమతులు, రెవెన్యూ శాఖ నుండి ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారి అనుమతులు, మున్సిపల్ శాఖ అనుమతులు మొదలగు లేనందున తాత్కాలికంగా కరీంనగర్ డెయిరీని తా త్కాలికంగా మూసి వేయడం జరిగింద ని తెలిపారు. వేములవాడ టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తుగా నోటీసులు జారీ చేయగా, వాటిని తీసుకోవడానికి నిరాకరించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. జిల్లా లోని పాడి రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయంగా విజయ డెయిరీ ఆద్వర్యంలో అధిక ధరకు పాలను సేక రించడం జరుగుతుందని వివరించారు. పాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 8341031867, 9121160538, 9398684240 సెల్ నెంబర్ లలో సంప్రదించాలని సూచించారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# ఎండాకాలం ప్రారంభమైంది..

- **టైం పాస్ చేయకండి..**
- **ఎల్లారెడ్డిలో జిల్లా కలెక్టర్ సీరియస్..**



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి)** ఎండాకాలం ప్రారంభమైంది, టైంపాస్ చేయకండి అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ అన్నారు. గురువారం ఆయన ఎల్లారెడ్డిలో మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అధికారులు టైంపాస్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాలికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే వేసవి కాలంలో పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతీరోజూ నిరంతర నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన పక్షంలో బోర్ వెల్స్ మరమ్మత్తులు చేయించాలని తెలిపారు. పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రతీ రోజూ నిర్వహించాలని, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించాలని తెలిపారు. డంపింగ్ యార్డ్ లో సెగ్రిగేషన్ షెడ్ లో విడివిడిగా సెగ్రిగేట్ చేయాలని తెలిపారు. 12 వార్డ్ లలోని చెత్తను 7 వాహనాల ద్వారా చెత్త సేకరణ చేపడుతున్నామని మున్సిపల్ సిబ్బంది కలెక్టర్ కు వివరించారు. పారిశుధ్య సిబ్బంది వేతనాలు సక్రమంగా చెల్లించాలని, ఈ.పి.ఎఫ్., ఈఎస్ఐ చెల్లించాలని తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ, అమృత్ పథకం క్రింద చేపడుతున్న పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. లీకేజీలను సత్వరమే మూసివేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో నాటిన మొక్కలకు వాటరింగ్ నిర్వహించి సంరక్షించాలని తెలిపారు. అనంతరం డి.ఆర్.సి.సి. కేంద్రం, సెగ్రిగేశన్ షెడ్ లను కలెక్టర్ పరిశీలించారు. కంపోస్టు ఎరువును వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. డంపింగ్ యార్డ్ ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లోఆర్డీవో మన్నే ప్రభాకర్ మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, తహసిల్దార్ మహేందర్ ఇంచార్జ్ ఎంపీడీవో ప్రకాష్ ఇంజనీరింగ్ అధికారులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

# విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- **ఫీజు రీయింబర్స్మెంట్ , స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలి**
- **పి.డి.ఎస్.యు. డిమాండ్**



**చట్టం బీబీపేట్** :తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక చట్టాల పైన, నిర్ణయాల పైన గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో గురువారం పి.డి.ఎస్.యు. కళాశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు. గిరిరాజ్ కళాశాల కమిటీ కార్యదర్శి నసీర్ మాట్లాడుతూ..తెలంగాణలో విద్యాశాఖ మంత్రి నియమించాలని డిమాండ్ చేశారు. దేశం బాగుపడాలన్న విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది అందుకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం, కేంద్ర బడ్జెట్లో 10శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుకోవడానికి కారణమవుతున్న పెండింగ్ రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ పాఠశాలలు చితిలావస్థలో ఉంటే, పాఠశాల విద్యలో 5,8 తరగతులకు డిటెన్షన్ విధానం వలన చాలామంది పేద విద్యార్థులు దూరమయ్యే అవకాశం ఉంది. వెంటనే డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశ్వాన్ని అర్థం చేసుకొని ముందుకు సాగవలసిన విశ్వవిద్యాలయాలు కుళ్ళిన కుల,మత రాజకీయాలలో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కోల్పోతుందన్నారు. వెంటనే విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తిని ఇవ్వాలని, బడ్జెట్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల వేతనాలకే కాకుండా, విద్యాలయాల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పి.డి.ఎస్.యు. నాయకులు వినయ, శ్రావణి,అర్చన, తనుజ,నవీన్,రమ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

- **స్వేరోస్ నెట్వర్క్ ఫౌండర్ డా, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఐ పి ఎస్ (వి ఆర్ ఎస్) ...**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** బొర్ర సురేష్ కుమార్ స్వేరోస్ నెట్వర్క్ కార్యవర్గ సభ్యులు తల్లి ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే.ఈ సందర్భంగా గురువారం రోజున ఉదయం స్వేరోస్ నెట్వర్క్ ఫౌండర్ డా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పరామర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్పునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నెట్వర్క్ జిల్లా అధ్యక్షులు ఉప్పులేటి బాబు, స్వేరోస్ నెట్వర్క్ సీనియర్ నాయకులు డా, సముద్రాల శ్రీనివాస్, చిలుముల మోహన్ బి.ఆర్.ఎస్ నాయకులు మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, బిగుళ్ల మోహన్, వడ్లూరి పర్శరాములు కొత్తోళ్ల బోనగిరి రాజ్ కుమార్, బొర్ర సారయ్య, బొర్ర రమేష్, బొర్ర అజయ్, కనగండ్ల రాజ్ కుమార్, కరుణాకర్, బోయిని సంపత్, బోయిని నర్సయ్య, మాంకాలి నగేష్, బెజుగం మల్లేశం, బొర్ర మల్లేశం మరియు స్వేరో నాయకులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఆఫీసర్ ప్రోగ్రాం



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్రా రోడ్డు రవాణా సంస్థ ఆర్మూర్ డిపోలో తేదీ 21ఫిబ్రవరి శుక్రవారం సాయంత్రం 4గంటల నుండి 5 గంటల వరకు డయల్ యువర్ ఆఫీసర్ ప్రోగ్రాం కలదనీ ఆర్మూర్ ఆర్టీసి డిపో మేనేజర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆర్మూర్ పరిసర ప్రాంత ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు, సూచనలు ఈ క్రింది నెంబర్ కు 9959226019 కు డయల్ చేయగలరన్నారు.

# గర్భవతుల ప్రమాదకర లక్షణాల గుర్తింపు శిక్షణ తరగతులు



**చట్టం రామగుండం కమిషనరేట్ :** జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు మహిళా ఆరోగ్య కార్యకర్తలకు "గర్భవతుల ప్రమాదకర లక్షణాల గుర్తింపు, చికిత్స, నిర్వహణ, దక్షత " శిక్షణ కార్యక్రమమును నిర్వహించడం జరిగినదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ జి. అన్నా ప్రసన్న కుమారి తెలియజేశారు. ఈ శిక్షణను రాష్ట్ర కార్యాలయం నుండి వచ్చిన డాక్టర్ స్రవంతి చే శిక్షణ ఇవ్వడం జరిగినది అని అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని మహిళా ఆరోగ్య కార్యకర్తలందరికీ ఈ శిక్షణను ఈ నెల 20, 21 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, ఇందులో ప్రమాదకర లక్షణాలు గల గర్భవతులను గుర్తించడం ఎలా, వాటి నిర్వహణ పైన అవగాహన కల్పించడం, మెళకువలు నేర్పించడం జరుగుతుంది అని అన్నారు. అర్మాన్ అనే యాప్ ద్వారా ఆరోగ్య కార్యకర్తలకు గర్భవతుల ప్రమాదకార లక్షణాలు, నిర్వహణకు సంబందించిన అవగాహన విడియోలను, సమాచారం అందించడం ద్వారా నూతన పరిజ్ఞానంను పెంపొందించుకుంటారు. దీనివలన ప్రమాదకార లక్షణాలు గల గర్భవతులకు సరియైన సేవలు, సలహాలు అందించటం జరుగుతుంది. తద్వారా మాతృ మరణాలను తగ్గించవచ్చు అని అన్నారు. కావున ప్రజలు మహిళా ఆరోగ్య కార్యకర్తల సేవలు వినియోగించుకోవాలని కోరారు.

# జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

- **మాదక ద్రవ్యాల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి**



**చట్టం, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి** :జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్, స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారీ లతో కలిసి సంబంధింత అధికారులతో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ (ఎన్కార్డ్)సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పోలీస్శాఖ కృషి చేస్తోందని, వాటికి ఇతర శాఖలన్నీ సహకారం అందించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టే దిశగా దృష్టి సారించాలని, గంజాయి ఒక సామాజిక దురాచారంగా తయారైందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్ళలోని విద్యార్థులకు, వీటిపై అవగాహనా కల్పించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని, పాఠశాల విద్యార్థులకు ప్రార్థన సమయాలలో పలు సందేశాలతో అవగాహన కల్పించాలని, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతీ పట్టణ మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కలిసి మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి గంజాయి వివిధ మార్గాల ద్వారా రవాణాలో ఉందని, వాటిపై పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు నిఘా పెట్టి నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనికి ఇతర శాఖలనుండి కూడా సహకారం అందించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా మరియు ఉత్పత్తి చేయడం చట్టవ్యతిరేకమైన చర్య అని, జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ మాదకద్రవ్యాల సరఫరా ఎక్కువగా ఉన్నదని అటువంటి ప్రాంతాల్లో పోలీసు శాఖ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని, ఇట్టి చర్యలకు పాల్పడిన వారు కఠినంగా శిక్షించ బడుతారని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా యువతీ, యువకులు ఈ మాదకద్రవ్యాల బానిసై తమ ఉన్నత భవిష్యత్తును నాశనం చేసుకోరాదని కోరారు. అదే విధంగా గంజాయికి బానిసైన వారి కోసం మెడికల్ విభాగం ఆధ్వర్యంలో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి వినయోగం ఎక్కడ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతీ పాఠశాలలో,కాలేజీల్లో మాదక ద్రవ్యాలపై యువతకు అవగాహన పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవో లు కృష్ణవేణి, గణేష్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు డీఎంహెచ్వో డాక్టర్ మురళీధర్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉమారాణి, జిల్లా టి.బి. కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకట్రాములు, ట్రైబల్ వేల్ఫేర్ డి.డి దేశీరాం, డి.ఐ.ఈ.ఓ మాదార్ ,బి.సి డెవెలప్మెంట్ అధికారి నరసింహస్వామి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ప్రభుత్వ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ లీల, విద్యశాఖ అధికారి శ్రీరాములు సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు...

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
- **పెండింగ్ ఆస్తి పన్ను గడువు లోగా వసూలు చేయాలి**
- **నగర పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **రామగుండం కార్పొరేషన్ పని తీరు పై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**చట్టం రామగుండం కమిషనరేట్ :**రామగుండం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం పురపాలక కార్యాలయంలో కార్పొరేషన్ పనితీరు పై పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టి.యూ.ఎఫ్.ఐ.డి.సి) నిధుల ద్వారా చేపట్టిన నగరాభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, ఆస్తి పన్ను వసూలు, టౌన్ ప్లానింగ్, తదితర అంశాలను కలెక్టర్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. నగరంలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, వరద నియంత్రణ పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తూ, పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపులు చేయాలని అన్నారు.. పారిశుధ్య నిర్వహణ కోసం నూతనంగా కొనుగోలు చేసిన ఆటోలు, ట్రాక్టర్లు పూర్తి స్థాయిలో వినియోగించాలని, నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని, చెత్త సేకరణ సంబంధించి నిర్దేశిత షెడ్యూల్ ఫాలో కావాలని , రోడ్లపై ఎక్కడ చెత్త లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# అంగన్వాడీ కేంద్రాలతో మహిళలకు నాణ్యమైన సేవలు అందాలి



- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
- **పౌష్టికాహార సరుకులు అంగన్వాడీలకు రెగ్యులర్ గా సరఫరా చేయాలి**
- **మానసిక వైకల్యం గల పిల్లలను మనో చైతన్య పాఠశాలలో చేర్పించాలి**
- **ప్రీ స్కూల్ లో పిల్లలకు బోధన పకడ్బందీగా జరగాలి**
- **రామగుండం పరిధిలోని అంగన్వాడి కేంద్రాల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**చట్టం రామగుండం కమిషనరేట్ :** మహిళలు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పకడ్బందీ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం పురపాలక కార్యాలయంలో రామగుండం పరిధిలోని అంగన్వాడి కేంద్రాల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. ప్రతి సూపర్వైజర్ తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ అవసరమైన పౌష్టికాహారం సెంటర్ కు అందుతుందా, గర్భిణీ మహిళలకు, బాలింతలకు పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరుగుతుందా వివరాలు తెలుసుకోవాలని, అంగన్వాడి కేంద్రాలకు పౌష్టికాహార సరుకులను రెగ్యులర్ గా పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు. న్యూట్రిషన్ కు సంబంధించి వాస్తవిక పరిస్థితులు నమోదు చేయాలని, ఎంత ఎక్కువ మంది గుర్తిస్తే అంత మంచిదని ,పోషక లోపంతో బాధపడే పిల్లలకు బాల అమృత్ ప్లేస్ లో అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతినెల పిల్లల బరువు చెక్ చేయాలని, తక్కువ బరువు ఉన్న పిల్లలకు అవసరమైన పోషకాలు అందించాలని కలెక్టర్ సూచించారు. మానసిక వైకల్యం గల పిల్లలను ముందుగానే గుర్తించి వారిని మనో చైతన్య పాఠశాలలో జాయిన్ చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో క్రోనిక్ వ్యాధులు గుర్తించిన 14 మందికి జిల్లా వైద్యా శాఖ ద్వారా అవసరమైన పరీక్షలు నిర్వహించి చికిత్స అందేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ , సిడిపిఓ అలేఖ్య,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక స్పృహ ఉన్న వ్యక్తిని శాసనమండలికి పంపిచాలి

- **మొదటి ప్రాధాన్యత (1) ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించండి...**
- **పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృతస్థాయిలో ప్రచారం**
- **స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు**



**చట్టం రామగుండం కమిషనరేట్:** తెలంగాణ విద్యా విధానంలో మార్పులు తేవాలంటే విద్యావేత్తతోనే సాధ్యమని, సామాజిక స్పృహ ఉన్న వ్యక్తికి మొదటి ప్రాధాన్యత (1) ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి శాసనమండలికి పంపించి కొత్త రాజకీయానికి తెర తీయాలని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు అన్నారు. రామగుండం, గోదావరిఖని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించి..అనంతరం ప్రజా సంఘాలు, మాజీ ప్రజాప్రతినిధులు ప్రయివేట్ పాఠశాలాల ఉపాధ్యాయుల, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ముచ్చటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... అగ్రవర్ణాలకు, అణగారిన వర్గాలకు జరుగుతున్న పోరాటంగా ఎన్నికలను గుర్తించాలని అన్నారు. విద్యా వ్యాపార రంగాలలో కోట్ల రూపాయలు దండుకున్న దళారులు ఓట్ల కోసం తిరుగుతున్నారని, పట్టభద్రులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మెదక్, నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాలో ఉండే ప్రతి పట్టభద్రుడు నిజాయితీ గల సామాజిక స్పృహ ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యగులు, గ్రాడ్యుయేట్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి

- **డీలర్లకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి** :ప్రజా పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ డీలర్లను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పంపిణి పై పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పారదర్శకంగా ప్రజా పంపిణి ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం, నాణ్యమైన సరుకులు అందించాలని, రేషన్ షాప్ డీలర్లు సరుకులను సక్రమంగా లబ్ధిదారులకు అందించడంలో పారదర్శకత పాటించాలన్నారు. జిల్లా నుండి ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించడం జరిగిందని, బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతినెలా ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన సమయంలోగా పంపిణి ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. రేషన్ షాపులలో సరుకు నిల్వ, వివరాలకు సంబందించిన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే వారిపై కేసులు నమోదు చేయాలనీ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం గోపాల్, అధికారులు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నాకు తరలిన న్యూడెమోక్రసీ కార్యకర్తలు





**చట్టం ఆర్మూర్:**రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రం నుండి వందలాదిమంది న్యూడెమోక్రసీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ సబ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటిన పూర్తిస్థాయిలో 6 గ్యారెంటీలను అమలు చేయడం లేదని, 420 ఎన్నికల హామీలను కూడా అమలు చేయాలని , విద్య వైద్య సౌకర్యాలను పేద ప్రజలకు ఇవ్వాలని , ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, మరియు బీడీ కార్మికులకు జీవన భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇందిర పార్క్ వద్ద మహా ధర్నా వేల మంది న్యూడెమోక్రసీ కార్యకర్తలతో నిర్వహించటం జరుగుతుందని అన్నారు. తరలి వెళ్లిన వారిలో న్యూడెమోక్రసీ నాయకులు ప్రిన్స్, ప్రజ సంఘాల నాయకులు రాహుల్, కళ్యాణ్, హుస్సేన్, సాయి, వందలాదిమంది కార్యకర్తలు తరలి వెళ్లారు.

# సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం..



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి) సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్** రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం ను ఆయన ప్రారంభించారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వివరాలను తెలుసుకున్నారు. పట్టణంలో పలువురు దాతలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాలు ఎంత ఎక్కువగా ఉంటే పట్టణం అంత ప్రశాంతంగా ఉంటుందన్నారు. అనంతరం పలువురు దాతలను ఐజీ సన్మానించారు. ఎస్పీ సింధుశర్మ, ఏఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# నవనాథ సిద్దేశ్వరుని దర్శించుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే



**చట్టం ఆర్మూర్:**ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం నవనాధ సిద్ధుల గుట్టపై గురువారం రోజు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మురళి నాయక్ భూక్యా, దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నవనాథ సిద్దిలగుట్ట ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి, వినయ్ కుమార్ రెడ్డికి ఘన స్వాగతం పలికి సిద్దేశ్వరునీ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయంలో అర్చన పూజలు చేశారు. గుట్టపై గల వివిధ దేవాలయాల దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారిని శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర గురించి ఎమ్మెల్యేకి వివరించారు. ఆలయ చరిత్ర తెలుసుకొని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికారాబాద్ లో 34 సబ్ జూనియర్ అంతర్ రాష్ట్ర ఛాంపియన్ షిప్ పోటీలు

- క్రీడా పోటీలను ప్రారంభించిన శాసనసభాపతి
- కబడ్డీ ఆట శారీదానికి మంచి వ్యాయామం
- క్రీడలతో శారీరక మానసిక శక్తి సామర్థ్యం పెరుగుతాయి
- ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తా
- తెలంగాణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు..

**శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**





**చట్టం వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణం సాకేత్ నగర్ లోని గౌలికర్ నర్సింగ్ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా బాల, బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలను ఈరోజు ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్.పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు, కోచ్ లు, యువతి, యువకులు. ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ..యువకులకు, విద్యార్థులకు విద్యతో పాటుగా ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమైనది. ప్రతి ఒక్కరు మంచి ఆరోగ్యం కోసం రోజులో కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం కోసం కేటాయించాలి.క్రీడలతో శారీరకంగా, మానసికంగా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. కలిసి ఆడడం వలన క్రీడాకారులలో నాయకత్వ లక్షణాలు వస్తాయి.కబడ్డీ మన దేశ జాతీయ క్రీడ, పూర్వ కాలం నుండి ఇది గ్రామీణ క్రీడ. కబడ్డీ ఆటకు, ఆటగాళ్లకు ఎప్పుడూ ఆదరణ లభిస్తుంది. కబడ్డీ ఆటతో శరీరానికి మంచి వ్యాయామం అవుతుంది. కబడ్డీ క్రీడాకారులు ఆరోగ్యంగా ఉంటారు.ప్రతిభ కలిగిన క్రీడాకారులను నేను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తాను.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు తెలంగాణాలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యునివర్సిటీని ఏర్పాటు చేశారు.మీరు జిల్లా స్థాయి నుండి రాష్ట్ర, దేశ స్థాయితో పాటుగా అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి వికారాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను.విజయం సాదించడానికి ప్రతి క్రీడాకారుడు పోరాడాలి. కానీ ఆటలో గెలుపు ఓటమిలు సహజం, రెండింటిని సమానంగా తీసుకోవాలి.వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇండోర్, ఔట్ డోర్ స్టేడియాల నిర్మాణానికి అయిదు ఎకరాలు కేటాయింపు జరిగింది, నిర్మాణానికి అవసరమైన ఏడు కోట్ల రూపాయలను ప్రభుత్వం తరుపున మంజూరుకు కృషి చేస్తాను.కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ళలో క్రీడలను ప్రోత్సాహించక నిర్వీర్యం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వచ్చాక క్రీడలకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. ఈ మధ్య కాలంలో సీఎం కప్ పేరుతో ప్రతి గ్రామంలో, పట్టణంలో క్రీడలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొంటున్న క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం జరుగుతుంది.

## జడ్జిలపై విచారణ..

**చట్టం,ఢిల్లీ:** హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం ఉందని పేర్కొంటూ లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. లోక్‌పాల్ ఇచ్చిన ఆదేశాలపై ఈ సందర్భంగా సుప్రీంకోర్టు అసంతృప్తిని, ఆందోళనను వ్యక్తం చేసింది. ఇది చాలా ఆందోళనకరమైన విషయమని పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో లోక్‌పాల్ రిజిస్ట్రార్, హైకోర్టు న్యాయమూర్తిపై ఫిర్యాదు చేసిన వ్యక్తికి సైతం నోటీసులు ఇచ్చింది. వాస్తవానికి, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై వచ్చిన ఫిర్యాదును లోక్‌పాల్ విచారించింది.

**విచారించే అధికారం ఉందంటూ..**

లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. లోక్‌పాల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చిన కోర్టు.. సదరు హైకోర్టు న్యాయమూర్తి పేరును బహిర్గతం చేయొద్దని, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఓకా ధర్మాసనం ఆదేశించింది. న్యాయమూర్తి పేరును గోప్యంగా ఉంచాలని ఫిర్యాదుదారుడికి స్పష్టం చేసింది. కేసు విచారణను మార్చి 18 వరకు వాయిదా వేసింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణకు హాజరయ్యారు. హైకోర్టు న్యాయమూర్తులు లోక్‌పాల్, లోకాయుక్త చట్టం 2013 పరిధిలోకి ఎప్పటికీ రారని స్పష్టం చేశారు.

## బంగ్లాపై టీమిండియా ఘన విజయం





**చట్టం , స్పోర్ట్స్:** ఎప్పటిలాగే రోహిత్ శర్మ దూకుడుగా ఇన్నింగ్స్‌ని ఆరంభించాడు. తొలి వికెట్‌కి 69 పరుగులు జోడించిన తర్వాత రోహిత్ శర్మ అవుట్ అయ్యాడు. 36 బంతుల్లో 7 ఫోర్లతో 41 పరుగులు చేసిన రోహిత్ శర్మ, టస్కిన్ అహ్మద్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. విరాట్ కోహ్లీ, శుబ్‌మన్ గిల్ కలిసి భాగస్వామ్యం నమోదు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చారు. 38 బంతుల్లో ఓ ఫోర్‌తో 22 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ, రిషద్ హుస్సేన్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. 17 బంతుల్లో 2 ఫోర్లతో 15 పరుగులు చేసిన శ్రేయాస్ అయ్యర్ కూడా నిరాశపరిచాడు. అక్షర్ పటేల్ 12 బంతుల్లో ఓ ఫోర్‌తో 8 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. కెఎల్ రాహుల్, శుబ్‌మన్ గిల్ కలిసి ఐదో వికెట్‌కి అజేయంగా 87 పరుగుల భాగస్వామ్యం జోడించి, టీమిండియాకి విజయాన్ని అందించారు. 125 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు శుబ్‌మన్ గిల్. ఇంగ్లాండ్‌పై ఆఖరి వన్డేలో కూడా సెంచరీ చేసిన శుబ్‌మన్ గిల్‌కి ఇది వరుసగా నాలుగో 50+ స్కోరు.. కెఎల్ రాహుల్ 9 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ని జాకీర్ ఆలీ జారవిడచాడు. శుబ్‌మన్ గిల్ 129 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 101 పరుగులు చేయగా, కెఎల్ రాహుల్ 47 బంతుల్లో ఓ ఫోర్, 2 సిక్సర్లతో 41 పరుగులు చేశాడు. రాహుల్ సిక్సర్‌తో మ్యాచ్‌ని ముగించాడు.

## మూడు స్థానాల్లో బీజేపీదే గెలుపు



**చట్టం, భువనగిరి:** మూడు ఎమ్మెల్సీ స్థానాలలో బీజేపీ పోటీ చేస్తుందని,ఈ మూడు స్థానాల్లో బీజేపీనే విజయం సాధిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ ,ఖమ్మం , నల్గొండ ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సుమారు 80 నియోజకవర్గాల్లో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ఉపాధ్యాయ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి ఉపాధ్యాయ జేఏసీ లో పని చేశారని అన్నారు.

## కమ్యూనిస్టులను విమర్శించడం సిగ్గు చేటు



**చట్టం, మేడ్చల్:** అదానీని తప్పించడానికే మోడీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశం అయ్యాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీపీఐ కౌన్సిల్ సమావేశం గురువారం కుత్బుల్లాపూర్ మండలం షాపూర్ నగర్ లోని పొట్లూరి నాగేశ్వర రావు భవన్ లో, జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, మోదీ అమెరికా వెళ్లి ట్రంపును కౌగిలించుకోవడం ధృతరాష్ట్ర కౌగిలిగా అభివర్ణించారు. మోడీ కేవలం వ్యాపారస్తుల కోసం వెళుతున్నాడనీ దుయ్యబట్టారు. అమెరికా భారత దేశ పౌరులకి సంకెళ్లు వేసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ అవలంబించిన విధానాలనే అవలంబిస్తున్నదని, ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చకుండా తాత్సారం చేస్తుందన్నారు. వెంటనే ఆర్టీసీ కార్మికుల యూనియన్లను పునరుద్ధరించి, ఎన్నికల నిర్వహించి, ప్రజాస్వామ్యత వాతావరణాన్ని కల్పించాలన్నారు. రానున్న రోజుల్లో ఖమ్మంలో ఐదు లక్షల మందితో అతిపెద్ద బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు.

## టీజీ ఈఏపీసెట్ 2025 నోటిఫికేషన్ విడుదల..

**25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు**

TGEAPCET

**చట్టం, హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే తెలంగాణ ఈఏపీసెట్ 2025 (EAPCET) నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనుంది. దరఖాస్తులో తప్పుల సవరణకు ఏప్రిల్ 6 నుంచి 8వ తేదీ మధ్య అవకాశం కల్పించారు.. 250 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 9 వరకు, రూ. 500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 14 వరకు, రూ. 2500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 18 వరకు, రూ. 5 వేల ఆలస్య రుసుంతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 19 నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు, మే 2,3,4,5 తేదీల్లో ఇంజినీరింగ్ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. ఈఏడాది కూడా ఈఏపీసెట్‌ను జేఎన్టీయూ నిర్వహించనుంది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, విజయవాడ జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కాగా, కన్వీనర్ కోటా బీటెక్ సీట్లు మొత్తం రాష్ట్రానికి చెందిన విద్యార్థులకే కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తున్నది.

**నాన్ లోకల్ కోటా రద్దు..**

ఇప్పటివరకు అమలులో ఉన్న 15 శాతం నాన్ లోకల్ కోటాను రద్దు కానుంది. కన్వీనర్ కోటా సీట్లన్నీ తెలంగాణకు చెందిన విద్యార్థులకే కేటాయించనున్నారు. ఇంజినీరింగ్ సీట్లను 70 శాతం కన్వీనర్ కోటాలో, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేస్తున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కన్వీనర్ కోటాలోని 85 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు, మిగిలిన 15 శాతం సీట్లకు తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీపడేవారు. అయితే ఉమ్మడి రాజధాని, రాష్ట్ర విభజన గడువు పదేండ్లు గతేడాదితో పూర్తయ్యాయి. దీంతో నాన్‌లోకల్ కోటా గడువు కూడా ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో కన్వీనర్ కోటాలోని పూర్తి సీట్లను రాష్ట్రానికి చెందిన విద్యార్థులకే దక్కనున్నాయి.

## స్కూల్ పిల్లాడిలా ఆటను ఆస్వాదిస్తున్నా


- రిటైర్మెంట్ తీసుకుని 6 ఏళ్లు అవుతోంది
- ఇప్పటికీ నేను ఆటను ఆస్వాదిస్తున్నాను
- టీమిండియా మాజీ ప్లేయర్ ధోనీ కీలక వ్యాఖ్యలు




**చట్టం,స్పోర్ట్స్:** అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనా.. స్కూల్ పిల్లాడిలా ఆటను ఆస్వాదిస్తున్నానని టీమిండియా దిగ్గజ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ అన్నాడు. చిన్నప్పుడు అయితే ఎలా ఇష్టంగా ఆడానో.. ఇప్పుడు అలానే ఆటను ఎంజాయ్ చేస్తున్నానని తెలిపాడు. 2019 వన్డే ప్రపంచకప్‌లో చివరి సారిగా ఆడిన ధోనీ 2020 ఆగస్ట్ 15న అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అప్పటి నుంచి ఐపీఎల్ మాత్రమే ఆడుతున్నాడు. అయితే ప్రతీ ఐపీఎల్ సీజన్ ముంగిట అతని రిటైర్మెంట్‌పై తీవ్ర చర్చ జరుగుతోంది. ధోనీ మాత్రం గత ఐదేళ్లుగా ప్రతీ సీజన్ ఆడి అభిమానులను అలరిచాడు. ఐపీఎల్ 2023లో చెన్నై సూపర్ కింగ్స్ సారథిగా జట్టును విజేతగా కూడా నిలబెట్టాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన ఐదేళ్లు కావడంతో ఈ సారి అనామక ఆటగాడిగా ఐపీఎల్ బరిలోకి దిగుతున్నాడు. తాజాగా ఓ యాప్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీని రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ప్రశ్నించగా.. మరోసారి సమాధానం దాటవేసాడు. రిటైర్మెంట్ ఎప్పుడు? అనే విషయంపై ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. క్రికెట్‌ను ఆస్వాదించాలనుకుంటున్నానని తెలిపాడు.

'నేను 2019లో రిటైర్ అయ్యాను. ఇది జరిగి 6 ఏళ్లు అవుతోంది. ఇప్పటికీ నేను ఆటను ఆస్వాదిస్తున్నాను. స్కూల్ రోజుల్లో ఎలాగైతే ఆటను ఆస్వాదించానో ఇప్పుడు అలానే ఆటను ఎంజాయ్ చేస్తున్నాను. నా చిన్నప్పుడు సాయంత్రం 4 గంటలకు స్పోర్ట్స్ బ్రేక్ ఉండేది. అప్పుడు మేం క్రికెట్ ఆడేవాళ్లం. వాతావరణం అనుకూలించకపోతే ఫుట్ బాల్ ఆడేవాళ్లం. చిన్నప్పుడు ఆట కోసం ఎంత తపించేవాడినో.. ఇప్పుడు కూడా అంతే ఇష్టంతో ఆడుతున్నాను.'అని ధోనీ చెప్పుకొచ్చాడు. అలాగే టీమిండియాకు ఆడుతున్నప్పుడు యువ ఆటగాళ్ల ఫోకస్ సరిగ్గా ఉండాలని ధోనీ అభిప్రాయపడ్డాడు.

## వాటర్ వార్



**చట్టం ,హైదరాబాద్:** కృష్ణా జలాల విషయంపై అధికార, ప్రతిపక్షాల నేతలకు మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలోలా కాదని కృష్ణా జలాల్లో సగం వాటా కావాల్సిందేనని తెలంగాణ పట్టుబడుతోంది. ఈ క్రమంలోనే దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం సైలెంట్‌గా ఉంటుందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తోంది. తాజాగా మాజీ మంత్రి హరీశ్ రావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మధ్యం వాటర్ వార్ నడుస్తోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. పదండి అని ఆయన కామెంట్స్ చేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే... కాంగ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది.

## కాళేశ్వరం విచారణ కమిషన్ గడువు పొడిగింపు

**చట్టం, హైదరాబాద్:** తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును మరోసారి పొడిగించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల బ్యారేజీల్లో అవకతవకలపై ఉమ్మడి ఏపీ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును ఏప్రిల్ 30 వరకు కమిషన్ గడువు పొడిగిస్తూ తెలంగాణ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ ఈ నెల 23న హైదరాబాద్ రానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి విచారణ కొనసాగించనున్నారు. ఈ దఫా మిగిలిన విచారణతో పాటు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేయనున్నట్టు సమాచారం. కాగా తదుపరి జరగనున్న విచారణలోఅధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లలతో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొంతమంది పెద్ద నాయకులను కూడా పిలిచే అవకాశముందని తెలుస్తోంది.

## 23న టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం



**చట్టం, హైదరాబాద్:** హైదరాబాద్ గాంధీభవన్‌లో ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు తెలంగాణ ప్రదేశ్ కమిటీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరగనుంది. టీపీసీసీ చీఫ్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఈ మీటింగ్ జరుగనుంది. ఈ భేటీలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌గా నూతనంగా నియామకమైన మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు, ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పీఏసీ, పీఈసీ సభ్యులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల ఛైర్మన్‌లు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అధికార ప్రతినిధులు పాల్గొంటారు. రాష్ట్ర, జాతీయ రాజకీయాలు, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చ ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

**త్వరగా పీసీసీ పదవుల భర్తీ..**

ఇదిలా ఉంటే.. టీపీసీసీ కార్యవర్గ ప్రకటన తాత్కాలిక వాయిదా పడినట్లు తెలుస్తోంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ గా తమిళనాడుకు చెందిన సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ నియమితులైన నేపథ్యంలో ఆమె రాష్ట్రానికి వచ్చి బాధ్యతలు స్వీకరించిన తర్వాతే ఈ ప్రకటన ఉంటుందని గాంధీభవన్ వర్గాల సమాచారం. వాస్తవానికి పీసీసీ కార్యవర్గాన్ని ఇప్పటికే ప్రకటించాల్సి ఉంది. గత నెలలో కేసీ వేణుగోపాల్ హైదరాబాద్ లో నిర్వహించిన సమీక్షలో వీలున్నంత త్వరగా పీసీసీ పదవులు భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ నెల మొదటి వారంలో జరిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో కూడా రెండు మూడు రోజుల్లో కార్యవర్గాన్ని ప్రకటిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. అయితే, ఈ జాబితా ఖరారవుతున్న సమయంలోనే రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ మార్చటంతో జాబితా ప్రకటనను వాయిదా వేశారని తెలుస్తోంది.

## నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్



**చట్టం, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో నిబంధనలు ఉల్లంఘించారని ఆయనపై గతంలో నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్, బేగంబజార్ పీఎస్, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో కేసులు నమోదు అయ్యాయి. అలాగే బీజేపీ రిజర్వేషన్లు తొలగిస్తుందంటూ గత ఎన్నికల్లో వీడియో రిలీజ్ వ్యవహారంలో రేవంత్ రెడ్డిపై కేసు నమోదు అయింది. ఆ సమయంలో రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నారు. ఇలా తనపై నమోదైన మొత్తం 9 కేసులకు సంబంధించిన విచారణలో భాగంగా రేవంత్ రెడ్డి గురువారం నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. సీఎం వస్తుండటంతో కోర్టు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేశారు. టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని తెలిపారు.

## కేసీఆర్ బిజీ బిజీ




**చట్టం , హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్లోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ వైద్య పరీక్షల కోసం గురువారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి.. సతీమణి శోభతో కలిసి వెళ్లారు. ఆస్పత్రికి వెళ్లిన కేసీఆర్‌కు వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలుస్తోంది. ఈ సమయంలో కేసీఆర్ వెంట సంతోశ్ రావు కూడా ఉన్నారు. ఉన్నట్టుండి గులాబీ బాస్ కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లటంపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కేసీఆర్ ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగానే.. ఏఐజీకి వెళ్లినట్టు తెలుస్తోంది. ఇదే క్రమంలో.. మరో ఆసక్తికర వాదన కూడా వినిపిస్తోంది. మాజీ సీఎం కేసీఆర్.. అమెరికా వెళ్లాలనే యోచనలో ఉన్నారని, అందుకోసమే ముందుగా వైద్య పరీక్షలు చేపించుకునేందుకు ఏఐజీ హాస్పటల్‌కు వెళ్లినట్టు తెలుస్తోంది. బుధవారం రోజున సికింద్రాబాద్ రీజినల్ పాస్ పోర్టు ఆఫీస్‌కు వెళ్లి తన పాస్‌పోర్టు రెన్యూవల్ చేయించుకోవంట ఈ వాదనకు బలం చేకూరుస్తుంది.

## అంగన్వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్



**చట్టం,కొండూరు /మైలవరం:** అంగన్వాడీ కేంద్రం (168) వద్ద అపరిశభ్ర వాతావరణంలో ఆహారం తిన్న 13 మంది చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం పెద్ద తండాలో గురువారం సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. రోజు వలే అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్నం భోజనం కింద చిన్నారులకు పప్పు, కోడి గుడ్డు పెట్టారు. కొద్ది సేపటి తర్వాత భూక్యా మోక్షిత(4), గుగులోతు సాయి దేవాన్ష్(5), జరబల జస్వంత దత్త(5), పవన్(4), అజ్మీర లవణ్యశ్రీ,(3), గుగులోతు మధురియా(4), జరబల శాన్వీ(4), అజ్మీర తేజష్(4), రిషీత(4), ఉదయశ్రీ(5) వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు 108కు సమాచారం ఇచ్చిన గంటకు కూడా అది రాకపోవడంతో టీడీపీ గిరిజన సంఘం నేత బాణావతు బీమ్లా నాయక్ ఆటోలో చిన్నారులను మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరబల చంటి కుమారుడు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎ.కొండూరు పీహెచ్‌సీ డాక్టర్ సహకారంతో మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చిన్నారులను తిరువూరు ఎమెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పరామర్శించారు. చిన్నారులకు అస్వస్థతగా ఉన్న సాయంత్రం వరకు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని, ప్రాణాలకు హాని జరిగితే ఎవ్వరు బాధ్యత వహిస్తారని అంగన్‌వాడీ సిబ్బందిని నిలదీశారు.

## మొదటి రోజు నుంచే ఆఫీస్‌కు.. పోస్ట్ కొత్తదైనా..స్టైల్ పాతదే



**చట్టం ,న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** తొలిసారి అసెంబ్లీకి ఎన్నికై.. ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేఖా గుప్తా నేరుగా రంగంలోకి దిగిపోయారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమం పూర్తికాగానే ఆమె నేరుగా సెక్రటేరియట్‌కు పయనమయ్యారు. సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి చాంబర్‌లోకి ఆమె ప్రవేశించి.. బాధ్యతలు చేపట్టారు. ఆ క్రమంలో కార్యాలయ సిబ్బందితో ఆమె మాట్లాడారు.అనంతరం సాయంత్రం 5.00 గంటలకు యమునా బజార్‌లోని వాసుదేవ్ ఘాట్‌ను ఆమె సందర్శించారు. అనంతరం మళ్లీ ఆమె సెక్రటేరియట్‌కు చేరుకోనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 7.00 గంటలకు సీఎం రేఖా గుప్తా అధ్యక్షతన కేబినెట్ సమావేశం ప్రారంభమైంది. ఆమె ప్రమాణ స్వీకారం కార్యక్రమంలోనే ఆరుగురు బీజేపీ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.తొలిరోజే ఇలా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేఖా గుప్తా.. అలా సెక్రటేరియట్‌కు వెళ్లి వెళ్లారు. ఆ క్రమంలో ఆమె ముహూర్త బలాన్ని సైతం చూసుకోలేదు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం...

- జిల్లాలో 8 చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్స్ ఏర్పాటు



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి)** క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని మల్టీజోన్ 1 ఐజి చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కామా రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా సదాశివ నగర్ దేవునిపల్లి పోలీస్ స్టేషన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ను ప్రారంభించారు. అనంతరం కొత్తగా నిర్మించిన సదాశివ నగర్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8 చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్స్ ఏర్పాటు చేశామన్నారు.చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్స్ ద్వారా ఎవరైనా పోలీస్ స్టేషన్ ను సందర్శించినప్పుడు వారి పిల్లలు అక్కడ ఎలాంటి భయం లేకుండా ఆడుకునేలా సౌకర్యాలు కల్పించామన్నారు. కామారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని కామారెడ్డి, దేవునిపల్లి బిక్కనూర్ ఎల్లారెడ్డి సదాశివ నగర్ గాంధారి ,బాన్సువాడ బిచ్కుంద పోలీస్ స్టేషన్ లలో చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, ఏ ఎస్పీ నరసింహారెడ్డి కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం ఆదుకుంటుంది

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**చట్టం నిర్మల్ ప్రతినిధి** అగ్ని ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.గురువారం పెంబి మండలం రాయదారిలో విద్యుత్ షాట్ సర్కిట్ వలన 6 నివాస గృహాలకు అగ్ని ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాద బాధితులకు భోజనం, రాత్రి బస ఏర్పాటు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటన సంబంధించి పూర్తీ వివరాలు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని, బాధితులకు ఆర్థిక సహాయం, పునరావాసం, నూతన ఇండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులు ఆందోళన చెందవద్దని, అందరం అండగా ఉంటామని కలెక్టర్ తెలిపారు.

## తమ ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలి



**చట్టం రామగుండం కమిషనరేట్ :** వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్ రుసుం వెంటనే చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ కోరారు. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబందించి అపరాధ రుసుం తో సహా ట్రేడ్ లైసెన్స్ రుసుం మొత్తం మార్చి లోపు చెల్లించనట్లయితే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం సదరు వ్యాపారులపై చర్య తీసుకోవడం జరుగుతుందని తెలిపారు . అలాగే 202526 ఆర్థిక సంవత్సరానికి సంబందించి లైసెన్స్ ఫీ కూడా మార్చి 31 లోపు చెల్లించనట్లయితే ఏప్రిల్ 1, నుండి 25 శాతం పెనాల్టీ విధించడం జరుగుతుందని తెలిపారు. కొత్తగా ట్రేడ్ లైసెన్స్ పొందాలనుకున్న వారు , రెన్యువల్ చేసుకోదలచిన వారు https://emunicipal.telangana.gov.in/ వెబ్ సైట్ ద్వారా లేదా మీ సేవా కేంద్రాలలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గది కొలతలు నమోదు చేసేటప్పుడు ఖచ్చితమైన వివరాలు ఇవ్వాలని అన్నారు. తప్పుడు కొలతలు నమోదు చేసినట్లు తనిఖీలో గుర్తిస్తే 25 రెట్ల పెనాల్టీ విధించడం జరుగుతుందని తెలిపారు. కొలతల్లో మార్పు అవసరమైనట్లయితే నగర పాలక సంస్థ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నగదు చెల్లింపులు లేకుండా ఆన్ లైన్ విధానం లోనే ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలని అన్నారు. ట్రేడ్ లైసెన్స్ కు సంబందించి వచ్చే ఫేక్ కాల్స్ కు స్పందించి మోసపోవద్దని హెచ్చరించారు . ట్రేడ్ లైసెన్స్ కు సంబందించి పూర్తి వివరాలు కావలసిన వారు నగర పాలక సంస్థ కార్యాలయంలోని పారిశుద్ధ్య విభాగంలో సంబందిత అధికారిని స్వయంగా లేదా ఫోన్ నెం . 9966626680 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు ...

- ప్రమాదంపై స్పందించిన జిల్లా కలెక్టర్...



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి)** ప్లే గ్రౌండ్ లో ఆడుకోవడానికి వెళ్తున్న ఇద్దరు విద్యార్థులను టాటా ఏస్ ఢీకొని గాయపడిన ఘటన గురువారం గాంధారిలో చోటుచేసుకుంది .గాంధారిలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న కళ్యాణ్ నాలుగో తరగతి చదువుతున్న అర్జున్ గురువారం ప్లే గ్రౌండ్ లో ఆడుకోవడానికి వెళ్తున్నారు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో వేగంగా వస్తున్న ఏపీ 09 టిఏ 3387 నెంబర్ గల టాటా ఏస్ విద్యార్థులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రంగా గాయాలయ్యాయి స్థానికులు వెంటనే పడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .విషయం తెలుసుకున్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**చట్టం న్యూస్ మోస్రా వర్ని** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని పలు మండలాల్లో MLC ఎన్నికల ప్రచారం పై ముఖ్య నాయకుల సమావేశాలలో పాల్గొన్న అగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,నిజామాబాద్ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి నిజామాబాద్,ఆదిలాబాద్,మెదక్,కరీంనగర్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మద్దతుగా బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ పట్టణం, బిర్కూరు ,కోటగిరి,పోతంగల్,వర్ని మండలాలలో ముఖ్య నాయకులతో సమావేశమై అన్ని గ్రామాలలోని ప్రతి ఒక్క ఓటరుని కలిసి ఈనెల 27 న జరగనున్న ఎన్నికలలో నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి భారీ మెజారిటీ వచ్చే విధంగా ప్రచారం చెయ్యాలని సలహాలు,సూచనలు తెలియజేసారు.ఈ సమావేశంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు

## రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన చర్లపల్లి



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ముల్కల పల్లిగ్రామానికి చెందిన బుర్ర రమేష్ అనారోగ్య కారణాల వలన మరణించాడు ఘనంగా నివాళులర్పిస్తూ వారి మరణం తీరనిలోటని వారి కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆర్టిఐ నేత వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ.. రమేష్ ఆత్మ శాంతి చేకూర్చాలని కుటుంబ సభ్యులను సోదరుడు బుర్ర సాగర్ వారి కుటుంబ సభ్యులను భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# 96.770 కిలోల గంజాయి పట్టివేత

- 2 కార్లు సీజ్, ఆరుగురు నిందితులపై కేసు నమోదు
- నలుగురు నిందితుల అరెస్ట్, పరారిలో ఇద్దరు
- పట్టుకున్న గంజాయి విలువ రు. 48,38,500



**చట్టం, రామగుండం కమిషనరేట్ :**రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి లోని పెద్దపల్లి జోన్ లో గల గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీపీ రామగుండము శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీసీపీ పెద్దపల్లి చేతన ఆద్వర్యంలో ఏసీపీ గోదావరిఖని ఎం. రమేష్ పర్యవేక్షణలో గుట్టుగా తరలిస్తున్న గంజాయి ముఠాను గోదావరిఖని టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11ఏ మైన్ క్రాస్ వద్ద వాహనాల తనిఖి చేస్తుండగా 2 కార్లలో తరలిస్తున్న 96.770 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు 2 వాహనాలు సీజ్ చేసి ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు.వివరాల్లోకి వెళితే రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ లో గల గోదావరిఖని టూ టౌన్ పోలీసులు వాహనాలు తనిఖి చేస్తుండగా 11ఏ మైన్ మీదుగా మహారాష్ట్ర కు తరలిస్తున్నారన్న 11ఏ మైన్ స్టేజీవద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటువైపుగా వస్తున్న కార్లను ఆపి తనిఖీ చేయగా, అందులో 96.770 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకొని విచారించగా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఉదయ్ వీర్, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కేశవ్ ఖర, సోమనాథ్ ఖర, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజులోధి సంజు అను వారు ఒక ముఠాగా ఏర్పడి గంజాయిని తరలిస్తున్నారని తెలిపారు. చత్తీస్గడ్ రాష్ట్రంలోనీ జగదల్పూర్ నుండి మంథని మీదుగా మహారాష్ట్ర కు తరలిస్తున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు పోలీస్ వారు 11ఏ మైన్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన 96.770 కిలోల గంజాయి విలువ రు. 48,38,000. ఉంటుందని తెలిపారు. సీపీ మాట్లాడుతూ..... గంజాయి రహిత కమీషనరేట్ గా మార్చడానికి రామగుండం కమీషనరేట్ పోలీస్ విస్నూత కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ, అవగాహన కల్పించడం జరుగుతుంది. కమీషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుదన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ,గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్నవారిపై నిఘా ఉంచి గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ లు నిర్వహించి గంజాయి సేవించే వారిని, వారికి గంజాయి అందించే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా గంజాయిని పండించినా/ అమ్మినా అక్రమంగా రవాణా చేస్తున్నా తమకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేసారు. యువకులు గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసై తమ విలువైన భవిష్యత్తును పాడు చేసుకోవడంతో పాటుగా తమ కుటుంబాలను మొత్తం ఇబ్బందులలోకి నేట్టేస్తున్నారని అంతేకాక గంజాయి మత్తులో, డబ్బుల కోసం aఉండాలంటే గంజాయి అనే మహమ్మారిని మనం అందరం కలిసి అంతం చేయాలని గంజాయి రహిత కమీషనరేట్ నిర్మాణంలో అందరు భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఈ ముఠా ను పట్టుకోవడంలో చాకచక్యం గా వ్యవహరించి న స్పెషల్ బ్రాంచ్ రామగుండం, టాస్క్ ఫోర్స్ రామగుండం, గోదావరిఖని టూ టౌన్ పోలీసు సిబ్బందినీ పోలీస్ కమీషనర్ అబినందించారు.

## 21న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం.. అప్పకపల్లెలో సీఎం రేవంత్ శంకుస్థాపన..!



**చట్టం న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నది. శుక్రవారం నారాయణపేట జిల్లాలోని అప్పకపల్లెలో సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.ఇల్లు లేని కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. మొదటి విడుతలో మంజూరు చేసిన 72,045 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం అప్పకపల్లె గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. మొదటి విడుతలో మంజూరు చేసిన 72,045 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్నది. ఇల్లు లేని కుటుంబాలందరికీ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. లబ్ధిదారులు స్వంతంగా ఇల్లు కట్టుకునే అవకాశం కల్పిస్తోంది. ఇంటి నిర్మాణానికి రూ.5.00 లక్షల పూర్తి సబ్సిడీతో ఆర్థిక సహాయం అందజేయనున్నది. బేస్మెంట్ నిర్మాణం పూర్తి కాగానే లబ్ధిదారుల ఖాతాలో రూ.లక్ష నేరుగా విడుదల చేయనున్నది.

## వనం నుంచి జనంలోకి రామక్క దేవత..



**చట్టం ఆళ్లపల్లి, :** కొమరం వంశీయుల ఆరాధ్య దైవమైన రెక్కల రామక్క జాతర జనసంద్రమైంది. గురువారం సాయంత్రం పాండువుల గుట్ట నుంచి వనదేవతను ఆలయ ప్రాంగణంలోని గద్దెల వద్దకు పూజారులు, కొమరం వంశీయులు తీసుకొచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది.వనదేవతను తీసుకువస్తున్న సమయంలో కొమరం వంశీయులు కమిటీ సభ్యులు గిరిజన సంప్రదాయాలతో ముత్యాలతో ఆడుతూ ఎంతో అంగరంగ వైభవంగా పాండవుల గుట్ట నుండి గుడి ప్రాంగణానికి దేవతను తీసుకువచ్చారు. ఈ జాతరకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ,పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విచ్చేసి వనదేవతలను దర్శించుకున్నారు.అనంతరం దేవాలయ ప్రాంగణంలో గిరిజన ముత్యాలు చేశారు. జాతర పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించిన వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మండల కేంద్రంలో అతిపెద్ద జాతర కావడంతో ఇల్లెందు డిఎస్పి చంద్రభాను, అల్లపల్లి ఎస్సై రతీష్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, పిఎసిఎస్ చైర్మన్ గుగ్గిల రామయ్య, రైతు సమన్వయ కమిటీ సభ్యుడు కొమరం వెంకటేశ్వర్లు, భారతీయ ఆదివాసి సమ్మేళన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు కొమరం లక్ష్మణరావు, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాయం నరసింహారావు, ఆలయ కమిటీ సభ్యులు కొమరం సత్యనారాయణ, కొమరం రాంబాబు, టీచర్ కృష్ణంరాజు, రవి, వెంకటేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ పరిధిలో ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ ఉస్మానియా యూనివర్సిటీ

**చట్టం న్యూస్** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్ ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈనెల 27వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 300 అపరాధ రుసుముతో వచ్చేనెల 3వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## శివనాస్మరణతో మార్మోగుతున్న శ్రీశైల క్షేత్రం..



**చట్టం శ్రీశైలం** : భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి మహా శివరాత్రి శోభను సంతరించుకున్నది. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు శ్రీగిరులకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో గురువారం క్షేత్ర వీధులన్నీ భక్తులతో సందడిగా కనిపించాయి. బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు సహా ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులు తెల్లవారుజాము నుంచే పాతాళగంగలో స్నానాలు ఆచరించి.. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దర్శనాల కోసం బారులు తీరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

## పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిని గుండెపోటుతో మృతి...



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి)** పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందిన ఘటన కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం సింగరాయపల్లి గ్రామానికి చెందిన శ్రీనిధి (14) కామారెడ్డి పట్టణంలోని ఆర్కిడ్స్ పాఠశాలలో పదవ తరగతి చదువుతుంది. విద్యార్థిని పెద్దనాన్న కల్కి నగర్ లో నివాసం ఉండగా అప్పుడప్పుడు పెదనాన్న ఇంటి నుండే పాఠశాలకు వస్తూ ఉంటుంది ఎప్పటిలాగే గురువారం కల్కి నగర్ నుంచి పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుండగా జీవితాన్ని స్కూల్ వద్ద ఒక్కసారిగా కూలిపోయింది.వెంటనే పాఠశాల యజమాన్యం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది .విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో సింగరాయపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## తొలగించిన టోల్ గేట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి...

- టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు...



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** బిక్నూర్ టోల్ గేట్ లో పనిచేస్తున్న 37 మంది కార్మికులను ఇటీవలే నూతనంగా కాంట్రాక్టు పొందిన సంస్థ తొలగించడం సరికాదని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ టోల్ రుసుమును వసూలు చేస్తూ నేషనల్ హైవే అథారిటీస్ సూచించిన నియమ నిబంధనలను పాటించడం లేదని స్థానికులకు గతంలో ఏ విధంగా అయితే టోల్ రుసుమును మినహాయింపు ఇవ్వడం జరిగిందో అదే విధానాన్ని కొనసాగించాలని అన్నారు.స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని,ఈ విషయంపైనే త్వరలో ఉన్నతాధికారులను సంప్రదిస్తామని అన్నారు.

## రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్‌ల బదిలీ..!

**చట్టం న్యూస్** రాష్ట్రంలో ఎనిమిది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ శాంతి కుమారి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర సహకార కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్‌గా కే సురేంద్ర మోహన్‌కు అదనపు బాధ్యతలు బాధ్యతలు అప్పగించింది. ఆరోగ్యశ్రీ సీఈఓగా ఆర్వీ కర్ణన్‌కు అదనపు బాధ్యతలు చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుతం ఆరోగ్య శ్రీ సీఈఓగా ఉన్న ఎల్ శివశంకర్‌ను జేఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.ఇక వాణిజ్య పన్నుల డైరెక్టర్‌గా కే హరితను నియమించింది. ప్రస్తుతం వాణిజ్య పన్నుల డైరెక్టర్‌గా ఉన్న సయ్యద్ అలీ ముర్తాజా రిజ్వీని బదిలీ చేసింది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా ఉన్న పీ ఉదయ్‌కుమార్‌ను బదిలీ చేయడంతోపాటు ఆ బాధ్యతలను యాస్మిన్ భాషాకు అదనపు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ ఫుడ్స్ ఎండీగా కే చంద్రశేఖర్ రెడ్డికి అదనపు బాధ్యతలు కేటాయించింది. నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను బదిలీ చేసింది. రాష్ట్ర టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్స్ డైరెక్టర్‌గా బీ శ్రీనివాసరెడ్డిని ఆయన మాతృసంస్థకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## మరోసారి తిరుమల శ్రీవారి ఆలయంపై విమానం చక్కర్లు.. పట్టించుకోని అధికారులు



**చట్టం తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంపై నుంచి మరోసారి విమానం వెళ్లడం తీవ్ర కలకలం సృష్టిస్తున్నది. గత కొంత కాలంగా శ్రీవారి ఆలయంపై నుంచి తరచూ విమానాలు తిరుగుతుండటంత తెలిసిందే. తాజాగా గురువారం ఉదయం ఆలయం గోపురం మీదుగా ఓ విమానం వెళ్లింది. దీని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎటుంటి రాకపోకలు సాగించకూడదు. అయితే ఈ విధంగా తరచూ శ్రీవారి ఆలయంపై నుంచి విమానాలు వెళ్లడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విషయంపై టీటీడీ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికీ విమానయాన శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తిరుమల గోపురంపై నుంచి విమానాలు వెళ్లడంపై ఆలయ అధికారులు ఇప్పటికే పలుసార్లు కేంద్రవిమానాయన శాఖకు విజ్ఞప్తి చేసింది. కనీసం తిరుమల శ్రీవారి ఆలయం సమీపంలో కాకుండా తిరుమల గగనతలంలో ఇతర ప్రదేశాల నుంచి విమానాల రాకపోకలు సాగించాలన్న టీటీడీ వినతులను విమానాయన శాఖ పట్టించు కోవడం లేదన్న విమర్శలున్నాయి. కాగా, హోంమంత్రి అనిత ఈ అంశంపై స్పందించారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం దృష్టికి ఈ అంశం వచ్చిందని.. దీనిపై దర్యాప్తుకు ఆదేశించామన్నారు. నివేదికలు వచ్చిన వెంటనే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి శ్రీవారి ఆలయం పైనుంచి విమానాల రాకపోకలు జరుగకుండా చూస్తామని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SIRIGADA PRASAD, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP:CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR, NIZAMABAD 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE, PUBLISHED AT H. NO. 33486/2, GAYATHRINAGAR, VARNI ROAD, NIZAMABAD503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR: SIRIGADA PRASAD, RNI REGD NO: TELTEL/2010/32350, CELL: 9948884497, EMAIL: sirigadaprasad99@gmail.com